అక్రమ అడ్మిషన్లు నిలిపివేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎలాంటి పర్మిషన్ లేకుండా ఓ అపార్ట్మెంట్లో గదిని అద్దెకు తీసుకొని నారాయణ కార్పొరేట్ పాఠశాలకు చెందిన కొంతమంది విద్యార్థులను చేర్చుకుంటున్నారని, అడ్మిషన్లు జరుగుతున్నాయని తమ దృష్టికి రాగానే అక్కడికి చేరుకొని వారిని అడ్డగించి అడ్మిషన్లను నిలిపివేసినట్టు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చరణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే మండల విద్యాశాఖ అధికారి ఎల్లయ్యను పిలిపించి ఆ గదికి తాళం వేయించినట్టు పేర్కొన్నారు.



గదికి తాళం వేయించిన నాయకులు

కూలింగ్ వాటర్ ప్యూరిఫైర్ వితరణ

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు భయంపల్లి గ్రామంలోని రెవెన్యూ పవర్ ఆఫ్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ వారు బుధవారం కూలింగ్ వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేశారు. ఆ సంస్థ యాజమాన్యం 150 లీటర్ల సామర్థ్యం గల ఒక లక్ష మూడు వేల రూపాయల విలువగల కూలింగ్ వాటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సిద్ధికి మాట్లాడుతూ విద్యార్థిలకు చల్లటి నీటిని అందించిన యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, సైట్ అడ్మినార్ వికాస్, ఇంజనీర్ రాజేష్, శ్రీనివాసరావు, బాయపల్లి మాజీ సర్పంచ్ బాలయ్య ఉపాధ్యాయులు ఉన్నారు.



పెండింగ్ బిల్లులు ఇస్తేనే

లెప్రసీ సర్వే చేస్తాం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశాలు, సీఐటీయూ నాయకులు

- ఆశాల డిమాండ్
- సిఐటియు ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

2021, 2022, 2023 పెండింగ్ లెప్రసీ సర్వే బిల్లులు ఇచ్చిన తర్వాతనే ఈ సంవత్సర లెప్రసీ సర్వేను చేపడతామని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాల లెప్రసి బిల్లులు మంజూరు చేయాలని అనేకసార్లు విన్నవించామని తెలిపారు. అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. హామీనిచ్చి 6నెలలు గడిచిందని, ఇప్పటికీ పెండింగ్ బిల్లులు రాలేదని తెలిపారు. లెప్రసి బిల్లుల మీద సమగ్ర విచారణ జరిపి ఆశా కార్యకర్తల పెండింగ్ బిల్లులు వెంటనే క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ, రేణుక సుకన్య, బాలమణి, రమా, సునీత, సిహెచ్ సర్సా, లలిత, ఆసియా, పద్మ, రేణుక, సరోజ, వసంత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పర్మిషన్ లేకుండా అక్రమ నిర్మాణాలు

- ప్రోత్సహిస్తున్న సెక్రెటరీపై చర్యలేవి ?

నవతెలంగాణ-పిట్లం

ప్రభుత్వ పర్మిషన్ లేకుండా అక్రమ ఇంటి నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్న తిమ్మానగర్ పంచాయతీ సెక్రటరీ రుక్మిణిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మండలంలోని తిమ్మనగర్ గ్రామంలో ఇటీవల వారసత్వంగా వస్తున్న ఇంటి స్థలాలను కుటుంబ సభ్యులందరి సమక్షంలో వాటాలుగా చేసి వారి ఒప్పందం తీర్మానం మేరకు ఇంటి స్థలాలను, ఇంటి పంపకాలను చేసిన అనంతరం రిజిస్ట్రేషన్ చేయవలసి ఉండగా పంచాయతీ సెక్రటరీ రుక్మిణి అందుకు విరుద్ధంగా ధనార్జనే పరమావధిగా భావించి తన తాత్కాలిక కారోబారి బోండ్ల చంద్రశేఖర్‌తో కలిసి కుటుంబ సభ్యులను విడదీసి కొందరిని మచ్చిగా చేసుకొని ఎక్కువ మొత్తం డబ్బులు ఆర్జించి అన్నదమ్ములలో కొట్లాటలు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్ దందాకు పాల్పడుతూ, ప్రభుత్వ పర్మిషన్ లేకుండానే అక్రమ ఇంటి నిర్మాణాలను సైతం ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు మెండుగా ఉన్నాయి.



తిమ్మానగర్‌లో బుధవారం ఓఇంటి నిర్మాణానికి పోసిన ముగ్గు

అక్రమ ఇంటి నిర్మాణదారులు ఈ నిర్మాణ ముగ్గు పోసే సమయంలో సెక్రెటరీ అనారోగ్య రీత్యా కారణాలు చూపుతూ ఆరోజు విధులకు ఎగనామం పెడుతున్నారనే విమ ర్శలు వెలువెత్తు తున్నాయి. సంబంధిత కారోబారి ఇటీవలి కాలంలో కొందరు చెల్లించినటువంటి ఇంటి టాక్సీలు, ఇంటి నిర్మాణం సొంత నిర్ణయ పర్మిషన్‌లు ఇస్తూ పెద్ద మొత్తంలో వసూల్ దందా కొనసాగిస్తూ జేబులో నింపుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. టాక్స్‌లు చెల్లించిన లబ్ధిదారులకు మళ్లీ బిల్లులు రావడంతో కంగు తిన్నట్లు సమాచారం. ఇలాంటి సెక్రటరీ, కారోబారిలపై డివిజనల్, జిల్లా అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

అనుమతులు ఇవ్వలేదు

బుధవారం గానీ, ఈ మధ్యకాలంలో ఎవరికైనా ఇంటి నిర్మాణాల గురించి ఎలాంటి ఇంటి నిర్మాణ అనుమతులు ఇవ్వలేదు. ఒకవేళ సెక్రెటరీ, కారోబారి ఇష్టానుసారంగా సొంత నిర్ణయాలతో తనకు తెలియకుండా, అక్రమ ఇంటి నిర్మాణాల పర్మిషన్ ఇస్తే వారే శిక్షార్హులవుతారు.

– బ్రహ్మం, తిమ్మానగర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, మండల పంచాయతీ అధికారి

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉద్యోగాల భర్తీకి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ పి వెంకటేశ్వర్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద ప్రాతిపదికన (కాంట్రాక్ట్) గౌరవ వేతనం పద్ధతిలో ఉద్యోగాల భర్తీకి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ పి.వెంకటేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 ప్రొఫెసర్లు, 15 అసోసియేట్ ప్రొఫెసర్లు, 15 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 15 సీనియర్ రెసిడెంట్స్ పోస్టుల కొరకు ఈ నెల 15న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రభుత్వ వైద్య కళాశాల నందు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు మార్చి 31, 2025 వరకు వైద్య విద్య సంచాలకుల పరిధిలో పనిచేసే కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా ప్రధాన ఆసుపత్రిలో పనిచేయవలసి ఉంటుందని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15న జరిగే ఇంటర్వ్యూకు విద్యార్హతలు, కుల, నివాస ధ్రువీకరణ, ఇతర ధ్రువీకరణ పత్రాలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, ఇతర వివరాలు, హనరోరియం కొరకు www.gmc.kamareddy.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని వెంకటేశ్వర్‌రావు ఆ ప్రకటనలో తెలిపారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదవ తరగతి ప్రతిభా పరీక్ష

- విజేతలకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లయోలా హైస్కూల్లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి ప్రతిభ పరీక్ష విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ పరీక్షలో విజేతలుగా మొదటి బహుమతి పి.అక్షయ, ముదాం నందిని, రెండో బహుమతి కె.అక్షర, పి.చందన, మూడో బహుమతి నిఖిల్, కృష్ణ, శ్రేయస్‌లు విజేతలుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా టీఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజవర్ధన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మూదం అరుణ్, లయోలా స్కూల్ కరస్పాండెంట్ వీరాచారి మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని. విద్యార్థులు ఇలాంటి అవకాశాలు వస్తే సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇలాంటి మోడల్ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో పరీక్షల పట్ల ఉన్న భయం అపోహలు తొలగిపోతాయని చెప్పారు. పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సాయి కృష్ణ, నితిన్, వేణు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



విజేత విద్యార్థులకు బహుమతులు అందజేత

అప్రమత్తంగా వాహనాలు నడపాలి

- డ్రైవర్ అసోసియేషన్ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

డ్రైవర్లు అప్రమత్తంగా వాహనాలు నడపాలని, ప్రతి ప్రయాణికుడు నా కుటుంబం అనే విధంగా సక్రమంగా వాహనాలు నడపాలని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు సూచించారు. మద్నూర్ మండల కేంద్రంలో డ్రైవర్ అసోసియేషన్ కమిటీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షులు మగ్దూం ఆధర్యంలో డ్రైవర్లు ఎమ్మెల్యేను ప్రత్యేకంగా సన్మానించారు. పలువురు డ్రైవర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఐడెంటి కార్డులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

నవతెలంగాణ-పిట్లం

వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని కారేగాం తాండకు చెందిన సునావత్ కిషన్ (45) 12న ఉదయం 10 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం 6:30 గంటలకు పిట్లం గ్రామ మారేడు చెరువు కట్టమీద కిషన్ మృతదేహం ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వ్యక్తి గొంతు కోసి హత్య చేసి.. ఆధారాలు దొరక్కుండా శవాన్ని కాల్చేందుకు గుర్తుతెలియని దుండగులు ప్రయత్నించినట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తమ్ముడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ, స్థానిక సిబ్బంది పరిశీలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రైతు శ్రేయస్సు కోసమే సింగిల్విండోలు

- మహాజనసభలో చైర్మన్ శ్రీనివాస్ పటేల్

నవతెలంగాణ-మద్నూర్

రైతు శ్రేయస్సు కోసమే సింగిల్ విండో ఉన్నాయని మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో నిర్వహించిన 54వ మహాజనసభలో ఆయన మాట్లాడుతూ.. సింగిల్ విండో కార్యదర్శి జయ బాబురావు, జమఖర్చుల వివరాలు తెలియజేస్తూ దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ మహాజనసభలో వైస్ చైర్మన్ శంకర్రావు, సింగిల్ విండో సభ్యులు, మండల వ్యవసాయాధికారి రాజు, విండో పరిధిలోని వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మెన్ శ్రీనివాస్ పటేల్

బైపాస్ రోడ్ సర్వే ప్రారంభం

నవతెలంగాణ-మోర్తాడ్

జాతీయ రహదారి 63 బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం మోర్తాడ్ మండల కేంద్రంలో చెందిన మున్నూరు కాపు రైతులు గత కొన్ని రోజులుగా ఆందోళన ప్రారంభించినప్పటికీ అధికారులు బుధవారం సర్వే ప్రారంభించారు. మొదట రైతు సమక్షంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా సమావేశం ఏర్పాటు చేసి రైతులకు పూర్తిగా అవగాహన కల్పించాలని అనుకున్నారు. కానీ రైతులు దానికి ఒప్పుకోకపోవడంతో 956 జీవో ప్రకారం ప్రభుత్వం ఎప్పుడైనా రైతు భూములను తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని ఆర్డీవో రాజా గౌడ్ రైతులకు వివరించారు. దీంతో తమకు ఉన్న కాస్త భూమిని ప్రభుత్వం గుంజుకుంటే తమకు తినడానికి తిండి కూడా దొరకదు అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తుండగా రైతు నాయకుడు న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రైతుల పక్షాన మాట్లాడే ప్రయత్నం చేయగా పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. ఆయనతోపాటు ఇతర నాయకులను అరెస్ట్ చేసి భీంగల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ అనుమతుల మేరకు తాము సర్వే నిర్వహిస్తామని రైతులు వ్యతిరేకిస్తే ప్రభుత్వ చర్యలు తీసుకుంటామని అధికారులు అనడంతో రైతులు సమావేశం నుంచి వెళ్లిపోయారు. రైతులు వెళ్లిపోవడంతో అధికారులు గాండ్లపేట నుంచి తిమ్మాపూర్ రహదారి వరకు బైపాస్ రోడ్డుకు అవసరమున్న రహదారి సర్వే నిర్వహిస్తూ హద్దులను ఏర్పాటు చేశారు.



సమావేశంలో పాల్గొన్న రైతులు, అధికారులు

పర్మిషన్ లేని 4 దుకాణాలు సీజ్

- మున్సిపల్ కమిషనర్ సుజాత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలో మున్సిపల్ నుంచి ఎలాంటి పర్మిషన్, హౌస్ నెంబర్ తీసుకోకుండా కొనసాగుతున్న నాలుగు దుకాణాలను బుధవారం సీజ్ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ సుజాత అన్నారు. కొందరు దుకాణ యజమానులు ఓపెన్ స్థలాలను అద్దెకు తీసుకొని రేకుల షెడ్లు వేసుకొని మున్సిపల్‌కు రూపాయి చెల్లించకుండా, ఇంటి నెంబర్ తీసుకోకుండా దుకాణాలను కొనసాగిస్తున్నారని, అలా కొనసాగుతున్న 84 దుకాణాలను గుర్తించి వాటికి ఫిబ్రవరి 26వ తేదీన నోటీసులు అందించామని తెలిపారు. నోటీసులు తీసుకున్న వారిలో నుంచి బుధవారం వరకు 12 మంది మున్సిపల్‌కు వచ్చి పన్నులు చెల్లించి హౌస్ నెంబర్ తీసుకున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ నుండి నోటీసులు ఇచ్చిన స్పందించని 72 మందిలో నుంచి బుధవారం మున్సిపల్ పరిధిలో గల కిషన్ షాపింగ్ మాల్, రెండు గ్రానైట్ మార్బల్ షాపులను, మున్సిపల్ ఎదురుగా గల ఎస్సార్ 2 వైన్స్ పర్మిట్ రూమును సీజ్ చేసినట్టు తెలిపారు. మిగిలిన 62 దుకాణాల యజమానులు పర్మిషన్లు తీసుకోకుంటే రెండు మూడు రోజులలో వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు.



పలు దుకాణాలను సీజ్ చేస్తున్న అధికారులు

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరగాలి

- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-మద్నూర్

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరగాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. జహీరాబాద్ పార్లమెంటు పరిధిలోని ఎస్సీ జుక్కల్ నియోజకవర్గం స్థాయి రాజకీయ పార్టీల గుర్తింపు ప్రతినిధులతో బుధవారం మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల సమయంలో వస్తున్న సమస్యలను తెలపడంతో వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. 18 ఏండ్లు నిండిన వారిని ఓటర్ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో ఉన్న 8 మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు, ఓటర్ జాబితాలను సరిచూసుకోని, సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో 8 మండలాల తహసీల్దార్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి యం.డి ముజీబ్, నయాబ్ తహసీల్దార్ భరత్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ విజయ్, గిర్దవర్ శంకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ..

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని కామారెడ్డి జిల్లా కలెక్టర్ పాలన అధికారి జితేష్ వి.పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల గురించి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణ పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట మద్నూర్ తహసీల్దార్ ఎండీ ముజీబ్ ఉన్నారు.

జిల్లా కలెక్టర్‌తో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు..

కలెక్టర్ జితేష్ వి పాటిల మద్నూర్ మండల కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకులైన ఆత్మ కమిటీ చైర్మన్ కొండ గంగాధర్, కుమ్మరి సచిన్ కలెక్టర్‌తో సరదాగా ఫోటోలు దిగి కలెక్టర్‌ను సన్మానించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

నవతెలంగాణ-బోధన్

మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం చెల్లించవలసిన బకాయి వేతనాలను, బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం బోధన్ మండల అధ్యక్షురాలు ఉమా, సాలూర మండల అధ్యక్షురాలు రూపా మాట్లాడుతూ పెంచిన వేతనాలను ఏప్రిల్ 2022 నుంచి అమలు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి 25 రూపాయలు చొప్పున స్లాబ్ రేటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గ్యాస్, గుడ్లను ప్రభుత్వం సరఫరా చేయాలని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అందించే ప్రయత్నం మానుకోవాలని, కార్మికులను అక్రమంగా తొలగించరాదని, అలాగే ప్రతి నెల 5వ తేదీన బిల్లులు, వేతనాలను మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో రూప, పుష్ప, ఉమా, సుభద్ర, ఈశ్వరి, లక్ష్మి, నాగరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఉండొద్దు

నవతెలంగాణ-నిజాంసాగర్

తాగ నీటి సమస్య ఉండకూడదని మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. గ్రామాలలో తాగునీటి సమస్యను నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో ఇంటి పన్ను 100శాతం వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అబ్బాగౌడ్, గ్రామాలలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యేచే సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం కల్దుర్కి సొసైటీలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు సొసైటీ సీఈఓ బసవేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఎడపల్లిలో నియోజకవర్గ స్థాయి లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేయనున్నారు.

ప్రమాదవశాత్తు గేదె మృత్యువాత

నవతెలంగాణ-తాడ్వాయి

మండలం నందివాడ పరిధిలోని పల్లె గడ్డ తండాలో సోమవారం ప్రమాదవశాత్తు ఓ గేదె మృత్యువాతపడింది. గ్రామంలోని సునావత్ దశరథ్‌కు చెందిన రూ.80వేల విలువైన గేదె మృతి చెందిందని వారు తెలిపారు. మేత కోసం వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ప్రమాదం బారిన పడిందన్నారు.

నర్సరీ మొక్కలపై రక్షణ చర్యలు పాటించాలి

నవతెలంగాణ-పిట్లం

నర్సరీ మొక్కలపై పంచాయతీ సెక్రెటరీలు రక్షణ చర్యలు పాటించాలని ఎంపీడీవో కమలాకర్ అన్నారు. బుధవారం మండలంలోని చిల్లర్గి గ్రామ నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండ వేడిమి వల్ల నర్సరీలలోని మొక్కలు ఎండిపోతున్నాయని, అందువల్ల క్రమం తప్పకుండా నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మం, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని మండల విద్యాధికారి దేవి సింగ్ అన్నారు. పరీక్షలు ఇష్టపడి రాసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఉమ్మడి మండలంలోని కొమలంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను ముందుగానే నిర్దేశించుకొని దానికి అనుగుణంగా ప్రణాళిక చేసుకొని చదువును ఇష్టంతో చదివి ఆ లక్ష్యాలను చేరుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అమర్ సింగ్, ప్రధానోపాధ్యాయుడు బాలచందర్, ఉపాధ్యాయులు శ్రీరామ్, నరసింహులు, సాయిలు, మీరను, లక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో

పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ కమల, ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, వడ్లం ఇంచార్జీ హెడ్మాస్టర్ రామాంజనేయులు, పిట్లం బాలికల హెడ్మాస్టర్ రమణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి వసతి కల్పించాలి

నవతెలంగాణ-రామారెడ్డి

తాగునీటి వసతి కల్పించాలంటూ మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన యువకులు పంచాయతీ కార్యదర్శి హరిలతకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పది రోజుల నుండి గ్రామంలో తాగునీటి సమస్య నెలకొందని, గ్రామపంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

బోరు మోటర్ మంజూరు



బోరు మోటర్ ప్రారంభిస్తున్న తండావాసులు

నవతెలంగాణ-సిరికొండ

ఎంపీపీ సంగీత రాజేందర్ నిధులతో చీమన్ పల్లి రెడ్యానాయక్ తండాలో బోరు మోటర్ మంజూరు చేయించారు. గుడి నిర్మాణానికి బోరు మోటర్ మంజూరు చేయించి మోటార్ బిగించి దానిని ప్రారంభించారు. ఈసందర్భంగా తాండ నాయకులు ఎంపీపీని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జితేందర్ సింగ్, శంకర్ నాయక్, విఠల్, సూరని రాజు, మంగ్య, బలరాం,దేశాయ్, రాములు, కళ్యాణ్, ప్రవీణ్, మోజ్య, రవి, రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు

ముదిరాజ్‌లకు సముచిత స్థానం

- ముదిరాజ్ కార్పొరేషన్ ప్రకటించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కొన్ని సంవత్సరాల తర్వాత ముదిరాజ్‌లకు సముచిత స్థానం లభించిందని తెలంగాణ ముదిరాజ్ మహా సభ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మెతుకు శివ కుమార్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్ కార్పొరేషన్ ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా ముదిరాజ్ పేదల పక్షాన నిరంతరం గొంతు వినిపించామని అన్నారు. కొన్ని సంవత్సరాల చరిత్ర తర్వాత అయిన ముదిరాజ్ లకు సముచిత న్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, దీని వల్ల తెలంగాణలో ఉన్న నిరుపేద ముదిరాజ్ లందరికి న్యాయం జరుగుతుందని అన్నారు. ముదిరాజ్‌ల జీఓ నెంబర్ 15 ను అమలు పరిచి బీసీ డీ నుండి ఏ కు మార్చాలని కోరారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్ద సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర ఆర్టీసీ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి చిత్రపటానికి ఆర్టీసీ ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్లు బుధవారం పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం పిఆర్సి ప్రకటించడం పట్ల సుమారు 53,000 మంది సిబ్బందికి, కార్మికులకు లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఇంచార్జ్ చైర్మన్ షేక్ మున్న పట్టణ అధ్యక్షులు సాయిబాబా గౌడ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులకు సుమారు 4000 నుండి 7000 రూపాయల వరకు ఒక్కొక్కరికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సాయిబాబా గౌడ్ శ్యాం గౌడ్, సాజిద్ , నల్ల రవీందర్ రెడ్డి , జిమ్మీ రవి,భుపేందర్ నటరాజ్ అభినవ్ , భగత్ పిట్టు ,ఎస్ కే బబ్లు మోయిన్ పట్టణ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదు

- యువజన కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న బైండ్ల ప్రశాంత్

నవతెలంగాణ-ఆర్మూర్

కాంగ్రెస్ నాయకుల గురించి ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ బైండ్ల ప్రశాంత్ అన్నారు. పీవీఆర్ భవన్‌లో బుధవారం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిని అభివృద్ధి చేస్తారని గెలిపిస్తే సినిమా డైలాగులు కొడుతూ పబ్బం గడుపుతున్నారని అన్నారు. నిధులు తీసుకురండి లేకపోతే అభివృద్ధికి సహకరించండి అని తెలిపారు. కానీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శిస్తే నియోజకవర్గంలో మా యువజన కాంగ్రెస్ నాయకులు మిమ్మల్ని తిరగకుండాలి చేస్తాం జాగ్రత్త అని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ విజయ్ అగర్వాల్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ తిర్మన్ పల్లి నవనీత్, నియోజకవర్గ నాయకులు ఏడ్డిగారి నిఖిల్, తోపారం భగత్ శ్రవణ్. రాజా శేఖర్, గుండు హరీష్, అల్జా పూర్ కిరణ్, వినోద్, శుశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించాలి

- ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- మండల పంచాయతీ అధికారి యూసుఫ్ ఖాన్



పన్నులు వసూలు చేస్తున్న ఎంపీవో

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రతి ఒక్కరూ ఇంటి టాక్స్ చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని మండల పంచాయతీ అధికారి యూసుఫ్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రంలో ఇంటి టాక్స్ 20 లక్షల చెల్లించవలసి ఉండగా 55 శాతం ఇప్పటివరకు పూర్తయిందని ఆయన తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులు రెండు టీములుగా ఏర్పడి పడకల్‌లో ఒకటి, మండల కేంద్రంలో మరొకటి టీముగా ఏర్పడ్డారు. ఇంటింటికి వెళ్లి ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరూ ఇంటి టాక్స్ చెల్లించినట్లయితే మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. మండలంలోని చందామియా గ్రామపంచాయతీ ఇంటి టాక్స్ 100 శాతం వసూలు చేసి మండలంలో ముందంజలో ఉందని తెలిపారు. ఇంకో రెండు మూడు రోజుల్లో ఇంకా రెండు మూడు గ్రామపంచాయతీల్లో 100శాతం వసూలు అయ్యే విధంగా పంచాయతీ కార్యదర్శులు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్రాన్ పల్లి పంచాయతీ కార్యదర్శి నరేష్, జక్రాన్ పల్లి టీం లీడర్ హరీష్, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గృహ జ్యోతితో నిరుపేదలకు లబ్ధి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గృహజ్యోతి పథకం నిరుపేదలకు లబ్ధి చేకూరుస్తుందని కేశ్‌పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. మండలంలోని కేశ్ పల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు గృహ జ్యోతి లబ్దిదారులకు జీరో బిల్లులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు ప్రశాంత్, మండల యువజన విభాగం ఉపాధ్యక్షులు మున్నూరు ప్రణయ్, మాజీ సర్పంచ్ సాయి కుమార్, సీనియర్ నాయకులు శ్రీధర్, గంగారెడ్డి, సాయన్న లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌లో సమస్యలు పరిష్కారమయ్యేనా?

- ఇంచార్జ్ చైర్‌పర్సన్ దృష్టిసారించాలి
- దోమల బెడద, ట్రాఫిక్ అస్తవ్యస్తం
- చెత్తాచెదారంతో మురుగుకాలువలు



నవతెలంగాణ-ఆర్మూర్

గత కొన్ని నెలల నుండి మున్సిపల్ చైర్ పర్సన్ లేకపోవడంతో పట్టణవాసులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. నూతనంగా ఇంచార్జ్ చైర్పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన షేక్ మున్నా పట్టణ సమస్యలపై స్పందించాలని ప్రజలు కోరుతున్నారు..

అపరిశుభ్రత... దోమలవిజృంభన..

పట్టణంతో పాటు విలీనమైన పెర్కిట్, మామిడిపల్లిని కలుపుకొని 36 వార్డులు ఉన్నాయి. కొన్ని వార్డులు తప్ప మిగతా వాటిలో అపరిశుభ్రత, దోమల విజృంభనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు వార్డుల్లో ఫాగింగ్ చేపట్టి దోమలను నిర్మూలించాల్సి ఉన్నప్పటికీ ఆదిశగా చర్యలు చేపట్టకపోవడంతో పట్టణ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మురికి కాలువలు చెత్తాచెదారంతో పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచి దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు గాంభూసియా చేపలను కాలువల్లో వదలాల్సి ఉన్నప్పటికీ ఎటువంటి పనులు చేపట్టడం లేదు. ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డే నామమాత్రం గానే కొనసాగుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇళ్లలోని పాత కూలర్లు, టైర్లలో ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు చెబుతున్న ఆచరణలో ఫలితం లేకుండా పోయింది.. ఖాళీ సీసాలు, కొబ్బరి బొండాలను దూరంగా పారవేయాలి. వాటిలో నీరు నిల్వ ఉంటే ఈడీస్ దోమ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. మున్సిపల్ పరిధిలోని మురికి కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలి.

దాడులు చేస్తున్న కుక్కలు, పందులు..

మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీటితో పాటు కోతులు పెంకుటిళ్లను ధ్వంసం చేస్తున్నాయి. కుక్కల దాడుల్లో కొందరికి తీవ్ర గాయాలు కాగా మరికొందరు చనిపోయారు.

అస్తవ్యస్తంగా ట్రాఫిక్...

పట్టణంలో వాహనాల రాకపోకల తీరు అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, మెడిసిటీ మెడికల్ హౌసింగ్ బోర్డ్ వెళ్లే సైడ్, మామిడిపల్లి చౌరస్తా వద్ద తీవ్ర ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎటు నుంచి వాహనాలు వస్తున్నాయో తెలియక అన్ని వాహనాలు ఒకే చోట చేరి ఎటు కదలని పరిస్థితి ఏర్పడుతుంది.. మున్సిపల్ ఆధ్వర్యంలో చౌరస్తాల వద్ద 13 లక్షల నిధులతో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేశారు. పట్టణానికి చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రతిరోజు వేలమంది తమ పనుల కోసం ఆర్మూర్ వస్తుంటారు. కొంతమంది వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. పాత బస్టాండ్ వద్ద, కొత్త బస్టాండ్, మామిడిపల్లి చౌరస్తావద్ద గోవింద్‌పేట్ వెళ్లే దారిలో ఆటోలు రోడ్లపైనే ని లపడంతో ఇ బ్బందులు తలెత్తుతున్నవి. మున్సిపల్ ఇంచార్జ్ చైర్ పర్సన్, పోలీస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే ఈ సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు అంటున్నారు.

కుంట పడుతున్న పట్టణ అభివృద్ధి..

2022 సంవత్సరం తై బజార్ వేలంపాటను 20 లక్షల 15 వేలకు ఒక వార్డు కౌన్సిలర్ భర్త, గత సంవత్సరం మార్చి 25న 25 లక్షల 30 వేలకు మరో కౌన్సిలర్ భర్త దక్కించుకొని కొంత డబ్బులు చెల్లించి మిగతావి బకాయి పడ్డారు. దీంతో ఏప్రిల్ 21న అప్పటి మున్సిపల్ కమిషనర్ ఇద్దరికీ నోటీసులు సైతం అందజేశారు. సరైన సమయంలో తై బజార్ డబ్బులు చెల్లిస్తే మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో అభివృద్ధికి కొంత మొత్తం తోడ్పాటుకు ఉపయోగపడుతుందని పలువురు భావిస్తున్నారు. గత కొన్ని నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి రైతు బజార్లో పరిశీలించి చిరు వ్యాపారులతో మాట్లాడారు. పలువురు కూరగాయల వ్యాపారులు తైబజార్ డబ్బులను అధికంగా వసూలు చేస్తున్నారని ఎమ్మెల్యేకు సైతం ఫిర్యాదు చేశారు. రెండు మూడు రోజుల్లో పూర్తి బకాయిలు చెల్లిస్తారని హామీ ఇచ్చినట్టు కమిషనర్ రాజా నవ తెలంగాణకు తెలిపారు..

ధర్నా చౌక్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, సీపీ



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్, సీపీ

నవతెలంగాణ-నిజామాబాద్-సిటీ/కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలో నూతనంగా కేటాయించిన ధర్నా చౌక్ స్థలాన్ని బుధవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ బెజదవాకం సందర్శించారు. ప్రజా సంఘాలు, వివిధ పక్షాల వారు ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసనలు తెలిపేందుకు వీలుగా జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదురుగా సుమారు వేయి చదరపు గజాల స్థలాన్ని జిల్లా యంత్రాంగం ధర్నా చౌక్ కోసం కేటాయించింది. ఈ స్థలాన్ని పరిశీలించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు, ప్రజాసంఘాలు, వివిధ వర్గాల వారు తమ నిరసన తెలియజేసేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఓల్డ్ కలెక్టరేట్ ఎదుట వెయ్యి చదరపు గజాల స్థలాన్ని కేటాయిస్తూ కొత్తగా ధర్నా చౌక్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. నిరసనలు తెలియజేయాలనుకునే వారు ముందస్తుగా పోలీస్ శాఖ ద్వారా అనుమతి తీసుకుని కొత్తగా ఏర్పాటు చేసిన ధర్నా చౌక్ ప్రాంతంలో నిరసన చేపట్టాలని సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం వద్ద, పాత కలెక్టరేట్ ప్రధాన రహదారికి ఆనుకుని నిరసనలు నిర్వహిస్తుండడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కొత్తగా ధర్నా చౌక్ కోసం స్థలాన్ని కేటాయించామన్నారు. ఇక నుండి నిరసనలు తెలిపే వారు ముందుగా పోలీసు శాఖ నుండి అనుమతి తీసుకుని కొత్త ధర్నా చౌక్‌లో నిరసనలు తెలపాలని సూచించారు. అవసరమైన సదుపాయాలు కూడా కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. సాధారణ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా, ముందస్తు అనుమతితో కొత్తగా ఏర్పాటు చేసిన ధర్నా చౌక్ ప్రదేశంలోనే నిరసనలు తెలుపాల్సి ఉంటుందని సూచించారు. ముందస్తు అనుమతి లేకుండా నిరసనలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే ఈ తరహా ఉల్లంఘనలకు సంబంధించి మూడు కేసులు నమోదయ్యాయని తెలిపారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఏ.సీ.పీ రాజా వెంకట్ రెడ్డి, సౌత్ తహశీల్దార్ బాలరాజు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు

- ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేసిన టీఆర్ఎస్వి నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/సిరికొండ

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టిన రోజును పురస్కరించుకుని టిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షుడు డా. శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరం లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జిల్లా అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ఇలాంటి నాయకురాలు ప్రజాసేవలో ఉండాలని, ఇలాంటి జన్మదిన వేడుకలను మరిన్ని జరుపుకోవాలని అభిలాషించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్వి నగర ప్రధాన కార్యదర్శి మధుకర్ రెడ్డి నాయకులు గణేష్ నాయక్, మోసిన్, ముత్తెన్న, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ : భారత జాగృతి అధ్యక్షురాలు నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం భారత జాగృతి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సిరికొండ మండల కేంద్రం తెలంగాణ చౌరస్తాలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైమరీ పాఠశాల, వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు ఫండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగీత రాజేందర్, వైస్ ఎంపీపీ తోట రాజన్న, జాగృతి కన్వీనర్ మల్లెల సాయిచరణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు దువ్వూరు సంతోష్ రెడ్డి, నర్సారెడ్డి, అన్సర్, సంతోష్, సీనియర్ బీఆర్ ఎస్ నాయకులు, జాగృతి నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవో ఆఫీస్‌కు క్యూ

- కరెంట్ బిల్లు, సిలిండర్ ఆన్లైన్ కాక ఇబ్బందులు



ఎంపీడీవో కార్యాలయానికి తరలివచ్చిన లబ్దిదారులు

నవతెలంగాణ-మోపాల్

ఆరు గ్యారెంటీల్లో అప్లై చేసుకున్న వారికి, ఉచిత కరెంటు 200 యూనిట్ల వరకు, గ్యాస్ సిలిండర్ సంబంధించి ఆన్లైన్ చేసినప్పుడు కరెక్ట్ గా సర్దుబాటు అవ్వక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావల్సి వస్తుంది. దీంతో మండల ప్రజా పరిషత్ ఆఫీసులో ఐదు రోజుల నుండి ప్రతిరోజు ప్రజలు ఉదయం నుండి సాయంత్రం వరకు అక్కడే వేచి చూడాల్సి వస్తుంది. అధికారులు ఇంక కొన్ని కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను తొందరగా తీర్చాలని అక్కడికి వచ్చిన ప్రజలు వేడుకుంటున్నారు. ముందే వేసవికాలం ఎండ తీవ్రత భరించలేక ప్రజలు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నారు. స్వగ్రామంలోని ఆన్లైన్ చేస్తే ప్రజలకు ఇబ్బందిగా ఉండదని అంటున్నారు.

వినియోగదారుల హక్కుల కోసం అవగాహన కల్పిస్తాం

- వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి
- ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వినియోధాగురుల హక్కులకోసం అవగాహన కల్పిస్తామని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. బుధవారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో 'ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి' నూతన వినియోగదారుల కమిటీ ఏర్పాటును వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి ప్రకటించారు. అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినం (మార్చి 15) పురస్కరించుకుని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పెందోట అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడిగా విఎస్.వర్మ, ప్రధాన కార్యదర్శిగా సందు ప్రవీణ్, కోశాధికారిగా మహదేవ్ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా కె. సాయి కుమార్, పి. ప్రవళిక, కార్యవర్గ సభ్యులుగా బానోతు సందీప్‌ను నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యవర్గం ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యలు, నాసిరకం ఔషధాలు, తూనికలు కొలతల్లో మోసాలు, ఆహార కల్తీ, రసీదు లేని జీరో వ్యాపారం, హాల్ మార్కింగ్ విధానం, వెండి ఆభరణాలలో సగం శాతం వరకు కల్తీ, అంగన్వాడీలో పౌష్టికాహారం, కల్తీ విత్తనాలు, పురుగు మందులు, విచ్చలవిడి మైనింగ్ వల్ల పర్యావరణ సమస్యలు తదితర అంశాలపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు పెందోట అనిల్ కుమార్, సందు ప్రవీణ్ అన్నారు. పాఠశాల స్థాయిలో వినియోగదారుల క్లబ్‌లు, స్టాండర్డ్స్ క్లబ్స్ ఏర్పాటు చేసి విద్యార్థులను చైతన్య వంతులను చేయనున్నామన్నారు. ముఖ్యంగా పాలలో హాని కరమైన కల్తీ ఆహార కల్తీ నిరోధక శాఖ నిర్లక్ష్యం చేయడంపై ఇక నుండి వినియోగదారుల నూతన కమిటీ అధికారులను అప్రమత్తం చేయనున్నదని కమిటీ సభ్యులు అన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)/జుక్కల్

మండలంలోని తగిలేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, రుద్రూర్ మండలం అంబం గ్రామానికి చెందిన 20మంది బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో డిసిసి డెలిగేట్ యలమంచిలి శ్రీనివాసరావు, రెడ్డిరాంబాబు, మహాలింగప్పా, ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండలంలోని వివిధ గ్రామాలలోని బీఆర్ఎస్ ముఖ్యనాయకులు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. లాడేగాం, డోన్గాం, చిన్నఎడ్గి, పడంపల్లి, జుక్కల్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్యనాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

అధికారికంగా విమోచన దినం ప్రకటించడం స్వాగతిస్తున్నాం

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వతంత్రం సిద్ధిస్తే మన తెలంగాణ మాత్రం హైదరాబాద్ కేంద్రంగా నిజాం నిరంకుశ పాలనకు గురి అవుతున్న సందర్భంలో ఎంతో మంది తెలంగాణ బిడ్డలు నిజాం, రజాకార్లకు ఎదురు తిరిగి ప్రాణాలు అర్పించారని అన్నారు. స్వతంత్రం తరువాత 13 నెలలకు సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆపరేషన్ పోలో ద్వారా పోలీస్ యాక్షన్ నిర్వహించి నిజాం మెడలు వంచి తెలంగాణకు ప్రజలకు విముక్తి కలిగించారని అన్నారు. అలాంటి సెప్టెంబర్ 17న తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ విమోచన దినంగా ప్రకటించి అధికారికంగా నిర్వహించాలన్న తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్వహిస్తామని హామీ ఇచ్చి మాటతప్పిందని అన్నారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం, నరేంద్రమోడీ తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని తీసుకున్న నిర్ణయం హర్షణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.


100 మందికి తగ్గకుండా కూలీలు హాజరు కావాలి : ఎంపీడీవో సవితరెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

ఉపాధిహామీ పనిలో ప్రతి గ్రామంలో 100 మందికి తగ్గకుండా కూలీలు హాజరయ్యేటట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎంపీడీవో సవితారెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం మండలంలోని గిద్ద గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో సవిత రెడ్డి, ఏపీఓ ధర్మారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ.. కొలతల ప్రకారం పనిచేసి రూ.272 వరకు కూలి పొందాలని, వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని కూలీలు ఉదయమే పనిలోకి వెళ్లాలని, తగిన నీటిని వెంట తీసుకెళ్లాలని, కూలీలకు సూచించారు. కార్యక్రమంలో టిఏ శ్రీనివాస్, కార్యదర్శి శ్రీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజయ్య ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నేతలపట్ల దురుసుగా ప్రవర్తించిన ఎస్ఐ హరిబాబును సస్పెండ్ చేయాలి

- పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్సై దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-భీంగల్

మోర్తాడ్‌లో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు మద్దత్తుగా ఆందోళన చేస్తున్న ఉద్యమ నేతలను అరెస్ట్ చేసిన సందర్భంగా ఉద్యమ నేతలపట్ల దురుసుగా ప్రవర్తించిన భీంగల్, ముప్కాల్ ఎస్సై లను సస్పెండ్ చేయాలని సిపిఐఎం మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి భీంగల్ పోలీస్ స్టేషన్ ముందు ఎస్సై దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ మాస్ లైన్, ప్రజాపంథా రాష్ట్ర నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ.. రోడ్ విస్తరణలో భూములు కోల్పోతున్న రైతుల పక్షాన మోర్తాడ్‌లో ఆందోళన చేస్తున్న పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ప్రభాకర్‌తో పాటు ప్రజాసంఘాల 10 మంది నేతలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటు అన్నారు. అరెస్ట్ చేసిన వారిపై అలాగే పోలీస్ స్టేషన్ వెళ్లిన నాయకుల పై ఎస్సై దురుసుగా ప్రవర్తించడం అప్రజా స్వామికమని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్, నాయకులు దామోదర్, బాబన్న, రాజేశ్వర్, నడ్పినర్సన్న, సాయిరెడ్డి, పివైఎల్ జిల్లా అధ్యక్షులు అనీస్, సిరికొండ, భీంగల్ మండల నాయకులు రమేష్, సర్పంచ్ సాయిలు, అరవింద్, .శ్రవణ్, మోహన్, రాజేశ్వర్, సతీష్ పాల్గొన్నారు.

పశుపోషణ యాజమాన్య పద్ధతులపై పాడి రైతులకు శిక్షణ



నవతెలంగాణ-గాంధారి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశుపోషణ యాజమాన్య పద్ధతులపై పాడి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మేలు జాతి పశువుల ఎంపిక, గడ్డి జాతులపై అలాగే కుడి జాతులకు సంబంధించి చర్చించారు. అలాగే రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాడి రైతులకు మినరల్ మిక్చర్, గొర్రెలు, మేకలు కలిగిన వారికి బ్రిక్స్ అందజేశారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి ప్రసాద్, సతీష్, వార్డ్ మెంబర్ సాయిలు, డైరెక్టర్ పోచయ్య, గోపాలమిత్ర రమేష్ రైతులు పాల్గొన్నారు.

ఇంటిపన్ను స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న ఎంపీడీవో శంకర్



స్పెషల్‌డ్రైవ్‌లో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి గ్రామంలో ఇంటి పన్ను వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టగా.. డ్రైవ్‌లో ఎంపీడీవో శంకర్, ఎంపీఓ గౌస్‌ఉద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో 100శాతం ఇంటి పన్నులను వసూలు చేసి పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని వారు పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్‌తో పాటు గ్రామంలోని అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయన గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకొని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు సిహెచ్ సాయిలు, జాజు శ్రీకాంత్, శివకృష్ణ, కారోబార్ కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల చివరికల్లా బురుజులు

కూల్చేందుకు చర్యలు

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- మద్నూర్‌లో ప్రమాదకరంగా మారిన బురుజుల పరిశీలన



బురుజులను పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-మద్నూర్

ఈనెల చివరికల్లా బురుజులు కూల్చేందుకు చర్యలు చేపట్టనున్నట్టు కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మద్నూర్ మండల కేంద్రంలో గల భారీ బురుజులు ప్రమాదకరంగా ఉండటంతో వాటిని జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించి పరిశీలించారు. ప్రతి వర్షాకాలంలో ప్రమాదకరం గా ఉన్న బురుజుల పట్ల హానీ జరుగుతుందన్న భయం ప్రజల్లో నెలకొనడంతో ప్రమాదకరమైన బురుజులు కూల్చేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకం గా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. బురుజులు కూల్చాలంటే భారీ ప్రొక్లింగులు కావాలని, ప్రస్తు తం మన దగ్గర ఉన్నవాటితో కూల్చ డం సాధ్యం కానందున భారీ యం త్రాలు ఎక్కడ లభిస్తే అక్కడనుంచి తీసుకురావడానికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకునేందుకు తాను సిద్ధం గా ఉన్నానని అందుకు మద్నూర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి డాక్టర్ బండివార్, అలాగే గ్రామ కార్యదర్శి సందీప్ కుమార్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో మార్చి నెలాఖరులోగా ప్రమాదకరం గా ఉన్న బురుజులు కూల్చే ప్రయత్నం చేద్దామని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ ఎండి ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళలో డిగ్రీ విద్యార్థిని ఉత్తమ ప్రతిభ



ఓరుగల్లు కళావైభవం ఆధ్వర్యంలో బెస్ట్ ఆర్టిస్ట్ అవార్డు ధృవపత్రం అందుకున్న అవంతి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రి మొదటి సంవత్సరం చదువుతున్న డిగ్రీ విద్యార్థిని ఈ.అవంతి వరంగల్‌లోని సాగంటి ఆర్ట్ అకాడమీ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన డ్రాయింగ్ కాంపిటీషన్‌లో ఓరుగల్లు కళావైభవంపై ఆమె నంది చిత్రాన్ని గీసి బెస్ట్ ఆర్టిస్ట్ అవార్డు అందుకున్నారు. ప్రముఖ ఆర్టిస్ట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సాగంటి మంజుల నిర్వహించిన ఆన్‌లైన్ డ్రాయింగ్ కాంపిటీషన్‌లో బోధన్ నుండి అవంతి పాల్గొన్నారు. పోటీలో భాగంగా ఆమె నంది చిత్రాన్ని గీసి పంపించగా ఆ చిత్రానికి బెస్ట్ ఆర్టిస్ట్ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ధ్రువీకరణ పత్రాన్ని పంపారు. అవంతి ఒకవైపు చదువుకుంటూనే ఖాళీ సమయంలో చిత్రాలు గీస్తూ తనలోని కళా నైపుణ్యాన్ని మెరుగుపరచుకుంటున్నారు.

అలాగే ఆమె గత సంవత్సరం డ్రాయింగ్ లోయర్ పరీక్షలు రాసి పాసయ్యారు. ఈ సంవత్సరం గత ఫిబ్రవరి నెలలో జరిగిన డ్రాయింగ్ హైయర్ పరీక్షకు హాజరయ్యారు. ఓరుగల్లు కళ వైభవం డ్రాయింగ్ కాంపిటేషన్‌లో తాను బెస్ట్ ఆర్టిస్ట్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.

'బ్యాంక్ ఆఫ్ ఇండియా'లో అపరిమితమైన సేవలు

- ఏ రుణమైనా 24 గంటల్లో అందిస్తాం
- తెలంగాణ జనరల్ మేనేజర్ వివేకానంద దుబే



మాట్లాడుతున్న తెలంగాణ జనరల్ మేనేజర్ వివేకానంద దుబే

నవతెలంగాణ-కామారెడ్డి

బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఏ రుణమైనా 24 గంటల్లో అందించే సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్టు తెలంగాణ జనరల్ మేనేజర్ వివేకానంద దుబే అన్నారు. బ్యాంకు ద్వారా అపరిమితమైన సేవలు పొందాలని సూచించారు. కామారెడ్డిలో బుధవారం బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రభుత్వ రంగ సంస్థ అని తెలిపారు. బ్యాంకులో గోల్డ్ లోన్, హోమ్‌లోన్, వ్యవసాయ, వాహనాల, డిపాజిట్లు, మ్యూచువల్‌ఫండ్ తదితర వాటి సేవలు ఎల్లవేళలా అందించనున్నట్టు పేర్కొన్నారు. వీటితోపాటు బ్యాంకులో ప్రతి ఒక్కరికి జీరో బ్యాలెన్స్ ద్వారా అకౌంట్ ఇవ్వనున్నట్టు తెలిపారు. పీఎం సురక్ష, జీవనజ్యోతి తదితర సౌకర్యాలు మా బ్యాంకులో ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రతి ఒక్కరూ బ్యాంక్ సిబ్బందికి సహకరించి బ్యాంక్ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ సుభాకర్, బ్రాంచ్ మేనేజర్ స్వరూప్, ఎల్డీఎం భార్గవ సుధీర్, ఆఫీసర్ మోహన్‌లాల్, వంశీ, క్యాషియర్ విక్టోరియా రచలి, లింగం తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం..

- తల్లీ బిడ్డ సురక్షితం



మగ బిడ్డకు జన్మనిచ్చిన కృష్ణవేణి

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గుర్జల్ గ్రామంలో అంబులెన్స్‌లో మహిళా ప్రసవమైంది. వివరాలిలా ఉన్నాయి.. గాంధారి మండల కేంద్రంలోని సీహెచ్‌సీ హాస్పిటల్ నుంచి గర్భిణీని బాన్సువాడ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మేడిపల్లి దగ్గర నొప్పులు ఎక్కువవడంతో అంబులెన్స్ పక్కన ఆపి అంబులెన్స్ సిబ్బంది డెలివరీ చేశారు. కృష్ణవేణి అండ్ రాందాస్‌కు పండంటి మగ బిడ్డ జన్మించాడు. డెలివరీ ఉదయం 5:28కి అయినది. ఈఆర్‌సీపీ డాక్టర్ దిలీప్ సార్ సహాయంతో ట్రీట్మెంట్ చేసి ఎంసిహెచ్ బాన్సువాడ హాస్పిటల్‌కు తరలించారు. ఈఎంటి కమలాకర్, పైలెట్ ప్రకాష్‌గౌడ్‌కు కృష్ణవేణి భర్త రాందాస్ కృతజ్ఞతలు తెలిపారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వేతనాలు వెంటనే మంజూరు చేయాలి



నిరసన చేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వేతనాల ఆలస్యంపై, సదాశివనగర్ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో బుధవారం తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేళ్లుగా ఆంగ్లమాధ్యమంలో బోధన చేస్తూ, ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నప్పటికీ సకాలంలో వేతనాలు అందుకోలేకపోతున్నామని ఆవేదనను వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ వేతనాలు సకాలంలో అందుతాయని భావించినప్పటికీ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, విద్యాశాఖ అధీనంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుల మాదిరి 010 పద్దు కింద ప్రతీనెల 1వ తేదీన వేతనాలు మంజూరు చేయాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మనవి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి చేసుకోవాలి

- ఎంపీపీ పాల్త్య విఠల్



మాట్లాడుతున్న ఎంపీపీ పాల్త్య విఠల్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని నసురుల్లాబాద్ ఎంపీపీ పాల్త్య విఠల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల సమీకృత సముదాయ భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని ఉన్న అధికారులు, వారి వారి శాఖల నివేదికలను చదివి వినిపించారు. సభ ప్రారంభం కాగానే ఎంపీటీసీలు, సమస్యలను సభాదృష్టికి తీసుకొచ్చారు. సమావేశానికి కొంతమంది అధికారులు సమయపాలన పాటించడం లేదని ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నసురుల్లాబాద్ మండల పరిధిలో ఉన్న వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సమయపాలన పాటించడం లేదని, దీనితో గ్రామాల్లో రైతు సమస్యలు తీవ్రంగా ఏర్పడుతున్నాయని సభ్యులు సభా దృష్టికి తీసుకొచ్చారు. సమయపాలన పాటించని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. మండలంలో 17 పౌర సరఫరా దుకాణాలున్నాయని ఇందులో ఆరు పౌరసరఫరా దుకాణాల డీలర్లు లేకపోవడంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపామని తహసీల్దార్ సభా దృష్టికి తీసుకొచ్చారు. వివిధ గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీరు రానున్న రోజుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని మిషన్ భగీరథ అధికారులు చెప్పారు. గత ప్రభుత్వం హయాంలోనే 95 శాతం మిషన్ భగీరథ పనులు పూర్తయ్యాయని అన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తవద్దని అధికారులకు సూచించారు. విధుల నిర్వహణలో అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. వేసవికాలం దృష్ట్యా విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంటుందని వ్యవసాయ విద్యుత్ రాత్రి 12 గంటల నుంచి ఉదయం తెల్లవారుజామున వరకు ఉంటుందన్నారు. రైతులు వ్యవసాయ విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ అధికారులు సూచించారు. గ్రామాల్లో వ్యవసాయానికి, గృహాలకు అప్రకటిత కరెంట్ కోతలు విధిస్తున్నారని పలువురు ఎంపీటీసీ సభ్యులు సభలో లేవనెత్తగా.. ప్రభుత్వం మారగానే మార్పు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్‌మెంబర్, ఎంపీడీవో నీలావతి, వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సు కోసమే మద్దతు ధర

- రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసమే పని చేస్తుందని ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు అన్నారు. రైతులు పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయ ఆవరణంలో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. క్వింటాలుకు మద్దతు ధర రూ.6760 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, వైస్ చైర్మన్ శంకర్‌రావు, సింగిల్ విండో కార్యదర్శి బాబురావు, సింగిల్ విండో డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ సెక్రటరీ విటల్, మండల వ్యవసాయ అధికారి రాజు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-కామారెడ్డి

ఉపాధ్యాయ పోస్టుల కొరకు డి.ఎస్.సికి సన్నద్ధమయ్యే షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు ఎస్సి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా ఎస్సి అభివృద్ధి అధికారి రజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిఐఈటీ, బీఈడీ, టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) అర్హత కలిగిన వంద మంది అభ్యర్థులకు ఏప్రిల్ 5, 2024 నుంచి జూన్ 16, 2024 వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కామారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ ఇవ్వనున్నామని ఆమె తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.tsstudycircle.com.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని రజిత పేర్కొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి పట్టణ అధ్యక్షులుగా నర్సింలు



అధ్యక్షులుగా నియామకపత్రాన్ని అందుకుంటున్న నరసింహులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి పట్టణ అధ్యక్షులుగా బోదాసు నరసింహులును నియమించినట్టు జిల్లా అధ్యక్షులు చింతల శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాలకు కమిటీలను నియమిస్తున్నామని అందులో భాగంగా ముందుగా ప్రధానమైన బాధ్యతలు ముఖ్య కార్యకర్తలకు నియామకం చేస్తున్నామన్నారు. మహిళా, విద్యార్థి, యువజన, ఉద్యోగ, సంక్షేమ సంఘం పదవీ బాధ్యతలలో ముఖ్య కార్యకర్తలను నియమిస్తామని వివరించారు. ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన కామారెడ్డి టౌన్ అధ్యక్షుడు బోదాసు నర్సింలు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర, జిల్లా కమిటీలు తనకు బాధ్యత అప్పజెప్పినందుకు వారికి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చింతల శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మరి రాజయ్య, టౌన్ ఉపాధ్యక్షులు సంగాగౌడ్, జిల్లా కార్యదర్శి డాక్టర్ రాజకుమార్, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ రాజేందర్, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ శ్రావణ్ కుమార్‌గౌడ్, బీసీ నాయకులు శివరాము, సాయిలు, రాజులు, సంజీవులు, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

గర్గుల్ పాఠశాలలో పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

మన ఊరు ఫౌండేషన్ గర్గుల్ ఆధ్వర్యంలో బుధవారం గురు గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మెన్ కేశిరెడ్డి గురువేందర్‌రెడ్డి పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేసినట్టు గురువేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుదలతో చదివి పరీక్షలు బాగా రాయాలన్నారు. అనంతరం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పిహెచ్ఎస్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మన ఊరు ఫౌండేషన్ అధ్యక్షులు ప్రభాకర్, సెక్రెటరీ సత్యనారాయణ, శ్రీ ఆర్యభట్ట ప్రిన్సిపాల్ హన్మంత్‌రావు, పీజేఆర్ ప్రిన్సిపాల్ విజయకుమార్, మంజీరా ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కౌటిల్య ప్రిన్సిపాల్ నరేష్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్‌గౌడ్, రాజ్‌కుమార్, సురేష్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల కోసం బారులు



నవతెలంగాణ-రెంజల్

మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన హెల్ప్‌లైన్‌లో ప్రజలు బారులు తీరారు. ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ, గ్యాస్ సబ్సిడీ కోసం తప్పులను సవరించుకోవడానికి ప్రజలు బారులు తీరారు. కరెంట్ బిల్లులో జీరో అకౌంట్ రావడం లేదని కొందరు, గ్యాస్ సబ్సిడీ కోసం మరికొందరు రావడంతో మండల ప్రజా పరిషత్ కార్యాలయం జనంతో కళకళలాడుతోంది. మండలంలో మూడు హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేసినప్పటికీ జనం ఎగబడుతూ రావడంతో సిబ్బంది వారి తప్పులను సరి చేయడంలో నిమగ్నమయ్యారు. ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా దరఖాస్తులోని తమ తప్పులను సరి చేసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు. తమ దరఖాస్తులను సరి చేసుకోవడానికి ఎలాంటి నిబంధనలు లేవని, ప్రతి ఒక్కరు సంయమనం పాటించి దరఖాస్తులను సరి చేసుకోవాలన్నారు.

ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్‌ను కలిసిన జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్



ఎంపీ అభ్యర్థిని కలిసిన ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కర్‌ను బుధవారం జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కష్టపడి పని చేసి కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని షెట్కర్ కోరారని, భారీ మెజారిటీతో సురేష్ షెట్కర్ను గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

మైనారిటీ గురుకుల, జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-కామారెడ్డి

2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని 6 మైనారిటీ గురుకుల పాఠశాలలు, 6 జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించనున్నట్టు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి దయానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గురుకులాల్లో 75శాతం, మైనారిటీలకు (ముస్లిం-64శాతం, క్రిస్టియన్-7 శాతం, జైన్, పార్సీ, బౌద్ధ సిక్-4శాతం), 25 శాతం, నాన్-మైనారిటీ (ఎస్సి-6శాతం, ఎస్టీ-4శాతం, బీసీ-12శాతం, ఓసీ-3శాతం) వర్గాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు రిజర్వేషన్ సౌకర్యం కలదని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో 5వ తరగతిలో, కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలతో పాటు 6,7,8వ తరగతులలో మిగిలిన సీట్లు (బ్యాక్‌లాగ్) ఖాళీల భర్తీ కొరకు మైనారిటీ అభ్యర్థుల నుంచి మాత్రమే దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఎతీవఱం-వశ్రీఖఅస్త్రుఖు.ఎస్ట్ర.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల వారికి ఆదాయ పరిమితి రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించి ఉండవద్దని ఆయన స్పష్టం చేశారు. వివరాలకు సంబంధిత పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ లేదా జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ కార్యాలయం నెం.9912244005, టీఎంఆర్ఈఐఎస్ హెల్ప్‌లైన్ నెంబర్ 040-23437909ను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు గడువు 31.03.2024 వరకు పొడిగించినట్టు పేర్కొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-బోధన్

ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను బుధవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేట్ (జెసి)లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో వెంకట్, ఇబ్రహీం, రవి, గగన్, సుదర్శన్, పవన్, రాజు, రవి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. అలాగే ఊట్‌పల్లి గ్రామంలో పాఠశాల విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నరేష్, వినోద్, తాహెర్, ఓబేద్, గంగాధర్ పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వారి మొదటి వార్షికోత్సవం

- నేడు అన్నదానం

నవతెలంగాణ-ముప్కాల్



పూజలు చేస్తున్న భక్తులు

మండల కేంద్రంలోని 'శ్రీ లక్ష్మీ నరసింహస్వామి' ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రోజు ఆలయంలో ఆలయ కమిటీ సంఘ సభ్యులు దంపతులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. యజ్ఞం, హెూమం కార్యక్రమాలు ఆలయ అర్చకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గురడి రెడ్డి కాపు సంఘ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ లంబాడి కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం పట్ల హర్షం

నవతెలంగాణ-మోపాల్

సంత్ సేవాలాల్ లంబాడి కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నందుకుగానూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి మండలికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కాంగ్రెస్‌పార్టీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం గిరిజన బంజారా తండాల్లో మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేతావత్ సురేష్ నాయక్ మాట్లాడుతూ బంజారాల అభివృద్ధి జరుగుతుందంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వల్లేనని నమ్మి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదు అని, బడుగు బలహీన వర్గాలు ఆశ జ్యోతిగా తెలంగాణ చరిత్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలిచిపోయారని అన్నారు. బంజార ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడు రుణపడి ఉంటారని తెలిపారు.

ఎన్‌సీఎస్‌ఎఫ్ యంత్రాలు, స్థలాల పరిశీలన

- సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్
- రైతులు, రైతు నాయకులతో భేటీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్

సారంగాపూర్‌లోని నిజామాబాద్ సహకార చక్కర కర్మాగారాన్ని బుధవారం నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు ఆర్.భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సందర్శించారు. ఈ ఫ్యాక్టరీలోని యంత్రాలను, ఫ్యాక్టరీకి చెందిన స్థలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, రైతులు, రైతు నాయకులతో భేటీ అయ్యారు. కర్మాగారం పునరుద్ధరణ విషయమై రైతుల అభిప్రాయాలను సేకరించారు. 2008 - 2009 సీజన్ నుండి మూతబడిన సహకార చక్కర ఫ్యాక్టరీని ప్రభుత్వం సహకార రంగంలోనే కొనసాగించాలని రైతు ప్రతినిధులు కోరారు. ప్రభుత్వం తోడ్పాటును అందిస్తే ఫ్యాక్టరీ పరిధిలోని రైతులు చెరుకు పంట పండించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. నిజాం షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించేందుకు వీలుగా ప్రభుత్వం పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఈ కమిటీ గత నెల చివరి వారంలో వాస్తవ పరిస్థితుల అధ్యయనం కోసం బోధన్ లోని నిజాం షుగర్ కర్మాగారాన్ని సందర్శించిందన్నారు. ఈ సందర్భంగా తాను నిజామాబాద్ సహకార చక్కర ఫ్యాక్టరీని సైతం పునరుద్ధరించాలని సబ్ కమిటీతో పాటు ముఖ్యమంత్రిని సైతం కోరడం జరిగిందన్నారు. దీంతో ఎన్‌సీఎస్ఎఫ్ స్థితిగతులపై నివేదిక అందించాలసిందిగా జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం సూచించిందన్నారు. ఇందులో భాగంగానే కలెక్టర్‌తో కలిసి కర్మాగారాన్ని సందర్శనకు వచ్చామన్నారు. రైతుల భాగస్వామ్యంతో సహకార రంగంలో కొనసాగిన ఈ ఫ్యాక్టరీని తిరిగి తెరిపించాలని ప్రభుత్వం పట్టుదలతో ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కర్మాగారాన్ని ప్రైవేట్ పరం చేయబోమని, తిరిగి దీనిని ఎలా నడిపించాలనే విషయమై అన్ని అంశాలను కూలంకషంగా పరిశీలించి ప్రభుత్వం సహేతుక నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. రైతులు, రైతు ప్రతినిధులు కూడా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. ఇప్పటికే ఎన్‌సీఎస్ఎఫ్ స్థితిగతుల గురించి రైతు ప్రతినిధులతో సమావేశమై వివరాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపామని అన్నారు. రైతుల



చెక్కర ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అభిప్రాయాలను పొందుపరుస్తూ, వాస్తవ పరిస్థితులతో కూడిన సమగ్ర నివేదికను వారం రోజుల్లోపు ప్రభుత్వానికి సమర్పిస్తామని అన్నారు. ఈ ఫ్యాక్టరీ విషయమై ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చర్యలు చేపడతామని అన్నారు. ఎన్‌సీఎస్ఎఫ్ కు చెందిన పూర్తి వివరాలను రెండు రోజుల్లో తనకు నివేదించాలని కలెక్టర్ కర్మాగారం ఇంచార్జ్ ఎండీ రవిని ఆదేశించారు. ఫ్యాక్టరీని సందర్శించిన వారిలో నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, శ్రీరాందత్తు, రైతు సంఘాల ప్రతినిధులు సాయరెడ్డి, గంగారెడ్డి, ఆకుల పాపయ్య వేల్పూర్ భూమయ్య లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి నిర్ణయం పట్ల హర్షం

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రకటించడం హర్షనీయమని పట్టణానికి చెందిన మున్నూరు కాపు కోఆర్డినేటర్ మల్యాల నర్సారెడ్డి బుధవారం తెలిపారు. ఎన్నికల ముందు మున్నూరు కాపు కార్పొరేషన్ గురించి అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మున్నూరు కాపు ముద్దుబిడ్డ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కార్పొరేషన్ కోసం కృషి చేశారని అన్నారు. ఈ కార్పొరేషన్ రావడానికి కారణమైన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ ఇన్చార్జి వినయ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపుల తరపున, నియోజకవర్గ మున్నూరుకాపుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

యాదవ కురుమ కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ ప్రభుత్వం యాదవ, కురుమ కార్పోరేషన్ ఏర్పాటు చేయడం పట్ల పిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. యాదవ, కురుమ కార్పోరేషన్ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి మండలికి ధన్యవాదములు తెలుపుతూ బుధవారం గాంధీభవన్లో మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా పాలనలో యాదవులు కురుమలు రాజకీయంగా, పారిశ్రామికంగా ఎదగాలని ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా మాట ఇచ్చినం...మాట తప్పం అన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశ జ్యోతిగా తెలంగాణ చరిత్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్, గౌరీ సతీష్, శ్రీకాంత్ యాదవ్, రాకేష్ యాదవ్, గణేష్ యాదవ్, లింగం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా నాయకుల అరెస్టులను ఖండించండి

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్డీవో, పోలీస్ అధికారులు దురుసుగా ప్రవర్తించటం సిగ్గుచేటని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు అన్నారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీంగల్ మండలాల మీదుగా నేషనల్ హైవేను ప్రస్తుతం ఉన్న రహదారి ద్వారా కాకుండా పంట పొలాలగుండా రోడ్డు వేయడం ద్వారా నష్టం జరుగుతుందని రైతులు ధర్నాలు చేస్తే వారికి మద్దతుగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ నిలబడిందదన్నారు. మోర్తాడ్‌లో ఆర్డీవో రాజాగౌడ్ ప్రజాభిప్రాయ సేకరణ అంటూ సమావేశం నిర్వహించగా వారికి అండగా వెళ్లిన సిపిఎంఎల్ ప్రజాపంథా పార్టీ నాయకులను ఆర్డిఓ రెచ్చగొట్టే విధంగా వాఖ్యలు చేస్తూ, పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తూ నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమైన చర్యని అన్నారు.

దీన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ ఎంఎల్ సబ్‌డివిజన్ నాయకులు ఆర్మూర్‌లో ఎసిపి, ఆర్డీవో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ నాయకులు ఆకుల గంగన్న అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఇప్పటికే మోర్తాడ్, కమ్మర్పల్లి, ప్రాంత రైతులు రైల్వే కోసం వరద కాలువకోసం తమ భూములను త్యాగం చేసి నష్టపోయారన్నారు. నేషనల్ హైవే పేరుమీద వారి భూముల నుండే సేకరిస్తామని అనడంతో వాళ్ళు వ్యతిరేకించార న్నారు. ఊరు మధ్య నుండి పాత రోడ్డు నేషనల్ హైవేగా చేసుకోమన్న కూడా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. దీనిపై ప్రజాపంథా సిపిఐ ఎంఎల్ నాయకులు వారికి అండగా నిలబడితే దుర్భాషలాడి అరెస్టు చేయించారన్నారు. సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా రాష్ట్ర నాయకులు వి ప్రభాకర్‌పై ముప్కాల్ ఎస్సై దుర్భాషలాడారని అన్నారు. పోలీసులు వెంటనే క్షమాపణలు చెప్పాలని, పెట్టిన కేసులను ఎత్తివేయాలని, వారిని విడుదల చేయాలని అన్నారు. అరెస్టును నిరసిస్తూ భీంగల్ పోలీస్ స్టేషన్లో ఆహారం తీసుకోకుండా నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.పిడిఎస్‌యు మండల అధ్యక్షులు ప్రణయ్, సిద్ధార్థ, మహేష్, రిసెంద్ర, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి కార్పొరేషన్‌ను ఏర్పాటు నిర్ణయం హర్షణీయం

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర ప్రభుత్వం పద్మశాలి కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం పట్ల నిజామాబాదు జిల్లా పద్మశాలి సంఘం హర్షం వ్యక్తం చేసింది. బుధవారం నిజామాబాద్ నగరంలోని కోటగల్లిలో ఉన్న జిల్లా పద్మశాలి సంఘ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు దీకొండ యాదగిరి మాట్లాడుతూ పద్మశాలి కార్పోరేషన్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు వల్ల పద్మశాలీలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పద్మశాలీల సర్వతోముఖాభివృద్ధికి కార్పోరేషన్ కృషి చేసేలా భారీగా నిధులు కేటాయించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో ప్రభుత్వాలు హామీ ఇచ్చినా కార్పొరేషన్ ఏర్పాటు కలగానే మిగిలిందన్నారు. పద్మశాలి కార్పోరేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, అందుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ,ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్‌లకు యాదగిరి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు బిజ్జు దత్త్రాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హన్మాండ్లు,ప్రధాన కార్యదర్శి అవదూత దశరథం, సలహాదారులు రాపెల్లి గురుచరణ్, సహాయ కార్యదర్శి మెరుగు లక్ష్మినారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతల గంగాదాస్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను, నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ బుధవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. స్వయంగా ఉపాధి పనికి వచ్చిన కూలీల హాజరు తీసుకున్నారు. ఉపాధి కూలీలకు గిట్టుబాటు అయ్యేలా కొలతల ప్రకారం పని కల్పించి, వివరాలను పక్కాగా రికార్డుల్లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్నందున పని ప్రదేశంలో కూలీలు సేద తీరేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ఎండల బారిన పడకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం స్మశాన వాటిక సమీపంలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించిన ఆయన ఎండల నుండి మొక్కలను కాపాడేందుకు షెడ్ నెట్ లను ఏర్పాటు చేయడంతో పాటు మొక్కల సంరక్షకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏవైనా మొక్కలు ఎండిపోతే తక్షణమే వాటి స్థానంలో కొత్త మొక్కలను సిద్ధం చేయాలన్నారు. నర్సరీలో మొక్కల పెంపకంలో అలసత్వం చూపొద్దని, నిర్దేశించిన లక్ష్యం మేరకు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా నర్సరీల నిర్వాహకులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేందర్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ అశ్వపతి, మెట్లు, పాల్గొన్నారు.

రూ.13.11 లక్షలకు నడ్పల్లి తైబజార్ వేలం

- దక్కించుకున్న మోహమ్మద్ జావిద్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



వేలం దక్కించుకున్న జావీద్‌కు అనుమతి పత్రం అందజేస్తున్న అధికారులు

డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నడ్పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్, మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్ 1 కార్యదర్శి నిట్టు కిషన్ రావు అధ్యక్షత పంచాయతీ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించారు. వేలం విధానాలను ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్ , గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావు వివరించి వేలంపాట ప్రారంభించారు. ఐదుగురు 50 వేల రూపాయలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. గతేడాది 12 లక్షలా 45 వేలకు మోపాల్ మండలంలోని కులాస్‌పూర్‌కు చెందిన మోహమ్మద్ జావిద్ దక్కించుకున్నారు. ఈసారి ఐదుగురు పాల్గొనగా గతేడాది కంటే ఈసారి అరవై ఆరువేల రూపాయలు ఎక్కువ పాడి కులాస్‌పూర్ గ్రామానికి చెందిన మోహమ్మద్ జావిద్ 13లక్షల 11వేలకు దక్కించుకున్నారు. వారాంతపు సంతలో వసూలు చేసే వాటికిగాను ఈసారి ధరలను గ్రామ పంచాయతీ అధికారులు అందజేశారు. ఈ తైబజార్ వేలం సోమవారం నిర్వహించిన టార్గెట్ రాకపోవడంతో మంగళవారం వాయిదా వేశారు. మంగళవారం సైతం 13 లక్షల వరకు రావడంతో చేసేదేమీ లేక మరోసారి వాయిదా వేశారు. మూడవసారి తై బజార్ వేలం నిర్వహించగా 13లక్షల 11వేలకు వేలం పలుకగా జావిద్‌కు ఏడారి పాటు తైబాజర్ నిర్వహించుకోవడానికి అనుమతి పత్రం ను అందజేశారు. గ్రామ పంచాయతీ నిర్ణయించిన ఈ ధరల ప్రకారం రోజు వారిగా వారాంతపు సంతలో తైబజార్ దక్కించుకున్న కాంట్రాక్టర్ వసూలు చేయాలని సూచించారు. ఈ నెల 31లోపు ధరల బోర్డులను ఏర్పాటు చేస్తామని, మహిళల కోసం మరుగుదొడ్లు నిర్మించాలని పూనుకున్నమని వారు వివరించారు. వారాంతపు సంతలో దొంగల సందడి ఎక్కువగా ఉంటుందని, పలువురి వద్ద నుండి సెల్ ఫోన్లు, డబ్బులు మాయం అవుతుండటంతో దొంగతనాలు అరికట్టేందుకు సీసీ కెమెరాలను బిగించడం జరుగుతుందని గ్రేడ్ వన్ కార్యదర్శి ఎంపిఓ నిట్టు కిషన్ రావు అన్నారు. తైబజార్‌ను దక్కించుకున్న మోహమ్మద్ జావిద్ ముందస్తుగా పావల వంతు డబ్బులను చెల్లించాలని అధికారులు గడువు విధించారు. ఇదే కాకుండా తొమ్మిది చెక్కులు ఇవ్వాలని సూచించారు. అధికంగా వసూలు చేస్తే వేలం రద్దు పర్చడం జరుగుతుందని వారన్నారు. సమావేశంలో జూనియర్ అసిస్టెంట్ రజత్ కుమార్, బిల్ కలెక్టర్ సంతోష్, రాము, కంప్యూటర్ ఆపరేటర్ శ్యాంసన్, బాబా, ఎజాజ్ పాల్గొన్నారు.

ఎస్టీ కార్పొరేషన్ ఏర్పాటుతో మరింత బలం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భీంగల్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని భీంగల్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు గోపాల్ నాయక్ అన్నారు. బుధవారం భీంగల్ బస్టాండ్ వద్ద ఎస్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వర్గం సభ్యుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఎస్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి, మంత్రి వర్గం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టీ కార్పొరేషన్ ఏర్పాటు తో గిరిజనులకు మరింత బలం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో బొదిరే స్వామి, డీసీసీ డెలిగేట్ కుంట రమేష్, రాములు నాయక్, జేజే నర్సయ్య అనంత్ రావు, వాక మహేష్, సేవల్, అంగోత్ రమేష్, గోపాల్ రమేష్, కత్తిలాల్, అజయ్, రవి, మదన్ మోహన్, సురేష్, సంతోష్, ఆకాష్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాల నందు కామర్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల ను బోధించుటకు అతిథి ఒప్పంద ప్రతిపాదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జి ధనావేని బుధవారం తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళ అభ్యర్థిని లు ఈనెల 16లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత సబ్జెక్టులలో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్డీ ఉన్నవారికి బోధనా అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ 18 వరకు ఉంటుందని, ఆసక్తిగల మహిళ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

ఉపాధి కూలీలకు చేతినిండా పని కల్పించాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనికి వచ్చే కూలీలకు గిట్టుబాటు అయ్యేలా పని కల్పించాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మేజర్ గ్రామపంచాయతీలో 125 మందికి తగ్గకుండా, మైనర్ గ్రామపంచాయతీలో 75 మందికి తగ్గకుండా ఉపాధి కూలీలను ప్రతిరోజు పనికి తీసుకురావాలన్నారు. టార్గెట్‌కు అనుగుణంగా కూలీల సంఖ్య పెంచడంతోపాటు వారికి కూలీ డబ్బులు గిట్టుబాటు అయ్యేలా ప్రతిరోజు మూడు నుంచి నాలుగు గంటలపాటు పని కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఒక ఉపాధి కూలీకి కనీసం రూ.240 కూలీ డబ్బులు గిట్టుబాటు అయ్యేలా కొలతల ప్రకారం పని కల్పించాలని తెలిపారు. నర్సరీలో మొక్కలు మంచిగా పెరిగేలా చర్యలు చేపటాలని, ఎండల నుండి మొక్కలను కాపాడేందుకు షెడ్ నెట్స్ ఏర్పాటు చేయాలని, ప్రైమరీ బెడ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈజీఎస్ ఏపిఓ విద్యానంద్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారు గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోవాలి

- ట్రాన్స్‌కో ఏఈ ప్రసాద్ రావు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

అర్హులైన వారు గృహ జ్యోతి దరఖాస్తు చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏయి ప్రసాద్ రావు అన్నారు. జీరో విద్యుత్ బిల్లు రానివారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ప్రజా పాలన రసీదు, ఫోన్ నెంబర్ తో ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని అర్హతలు ఉండి దరఖాస్తు చేసుకున్న వారికి మరుసటి రోజు జీరో విద్యుత్ బిల్లు వచ్చే అవకాశం ఉందని తెలియజేశారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఐఎఫ్‌టీయూ(ఇఫ్టూ) (శ్రామికస్పందన)

అధ్యక్ష కార్యదర్శులుగా సుధాకర్, మల్లేష్

నవతెలంగాణ-ఆర్మూర్



సుధాకర్



మల్లేష్

ఐఎఫ్‌టీ యూ(శ్రామిక స్పందన) అధ్యక్ష, కార్యదర్శులుగా సుద్దపల్లి సుదాకర్, కర్నాటి మల్లేష్ ఎన్నికయ్యారు. సంఘటిత, అసంఘటిత కార్మిక హక్కులను హరించివేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ దోపిడీ పాలవర్గాలకు వ్యతిరేకంగా ఐక్యంగా కలిసి ఉద్యమించేందుకు ఐఎఫ్‌టియు.(ఇఫ్టూ), ఏఐఎఫ్‌టియు. కార్మిక సంఘాలు ఒకే సంస్థ నిర్మాణం కింద "ఐఎఫ్‌టియు(ఇఫ్టూ)(శ్రామిక స్పందన)" గా విలీనం అయ్యాయి. పట్టణంలో బుధవారం సంఘాలకు చెందిన తెలంగాణ రాష్ట్ర నేతల సమావేశం సయ్యద్ మైమూద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఇఫ్టూ జాతీయ కార్యదర్శి షేక్ షావలి పాల్గొని, మాట్లాడారు సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక, అప్రజాస్వామిక మతతత్వ, కార్పొరేట్ దోపిడీ విధానాలను యావత్ కార్మిక వర్గం సంఘటితంగా కోరారు. మతప్రాతిపదికన పౌరసత్వాన్ని అమల్లోకి తెచ్చిన వివక్షాపూరిత అప్రజాస్వామిక సీఏఏను తిరస్కరించాలని పిలుపు నిచ్చారు. బీజేపేతర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయబో మని భహిరంగంగా ప్రకంటించాలని డిమాండ్ చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి వలస వచ్చిన వారికి ఎలాంటి పత్రాలు లేకుండా కేవలం ముస్లింలను మనహాయించి మిగతావారికి పౌరసత్వాన్ని అందించే చట్టాన్ని అమలు చేయడం వెనుక బీజేపీ, ఆర్ఎస్ఎస్ రహస్య ఏజెండలో భాగంగా జరుగుతున్న కుట్రలో బాగమేనని షేక్ షావలి స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు మత విద్వేషాలను పెంచి, తిరిగి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్న బీజేపీ నరేంద్రమోదీ, అమీత్ షాల రాజకీయ కుతంత్రాల ను ఎండగట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఐఎఫ్‌టియు(శ్రామిక స్పందన) సహాయ కార్యదర్శిగా సయ్యద్ మైమూద్, ఉపాధ్యక్షులుగా బిచ్చల నర్సింహ్మా, కోశాధికారిగా తుర్పాటి శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా లాల్‌ఖాన్, బడిగే వెంకటేశ్వర్లు మరో నలుగురిని కో ఆప్షన్ సభ్యులుగా నూతన కార్యవర్గంలో ఎన్నికయ్యారు.

మిషన్ సెమీ కండక్టర్ల తయారీలో దేశం ముందుండాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భారత ప్రధాని నరేంద్ర మోడీ 'విక్షిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా రూ. 1.25 లక్షల కోట్ల విలువైన మూడు సెమీకండక్టర్ ప్రాజెక్టులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని తెలంగాణ విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ సెమినార్ హాల్లో వివిధ విభాగాలకు చెందిన ఆచార్యులు, విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రసంగిస్తూ స్వదేశీ పరిజ్ఞానంతో సెమీ కండక్టర్ రంగంలో ముందుకు పోవడం భారతదేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సెమీకండక్టర్ డిజైన్, తయారీ, సాంకేతిక అభివృద్ధితో భారతదేశాన్ని గ్లోబల్ హబ్‌గా ఉంచి, దేశ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రధానమంత్రి దృష్టిసరించినట్లు తెలిపారు. వికసిత భారత్ విజన్‌కు అనుగుణంగా, గుజరాత్‌లోని ధొలేరాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ యూనిట్లు, అస్సాంలో అవుట్ సోర్స్ సెమీకండక్టర్ యూనిట్ ల కోసం శంకుస్థాపన చేసినామని పేర్కొన్నారు. ఈ పరిశ్రమల ద్వారా, సెమీకండక్టర్ వ్యవస్థ బలోపేతం అవుతుందని దీనితో భారతదేశంలో కమ్యూనికేషన్స్, ఆటోమొబైల్, ఫార్మసీ, వైద్య, ఇంధన, రవాణా, ఉపగ్రహ, నిర్మాణ రంగాల్లో స్థిరమైన స్థావరాలు ఏర్పాటు అవుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ సెమీకండక్టర్ పరిశ్రమల్లో వేలాది మంది యువతకు ఉపాధి, ఉద్యోగత లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా రూసా నోడల్ ఆఫీసర్ డాక్టర్ వాసం చంద్రశేఖర్ వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్ ఆరతి, వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ ఎం సత్యనారాయణ, ప్రొఫెసర్ డాక్టర్ నసీం, ప్రొఫెసర్ లావణ్య, ప్రొఫెసర్ సంపత్ కుమార్, డాక్టర్ భ్రమరాంబిక, వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నందిపేట్

మండల భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన సందర్భంగా స్థానిక నందికేశ్వర ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు అభిషేకం, అర్చన నిర్వహించారు. కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకొని, కార్యకర్తలంతా స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా నందిపేట్ మండల భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు మచ్చర్లసాగర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల కోసం నిరంతరం పాటుపడుతున్నారన్నారు. కవితమ్మ జన్మదినం సందర్భంగా ఉమ్మెడ గ్రామంలో అగ్నిప్రమాదంలో దుకాణాన్ని కోల్పోయిన వ్యక్తికి చేయూతను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నందిపేట్ మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ హుస్సేన్, మాజీ ఉపసర్పంచ్ భరత్, హుస్నావుద్దీన్, మాజీ ఎంపీటీసీ హైమత్ ఖాన్,ఫేమస్ జోరుపూర్ ఇమ్రాన్, మైనార్టీ విభాగం అధ్యక్షులు పాషా, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిబ్బంది ఆరోగ్య రక్షణకే కంటి శిబిరం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

టోల్ ప్లాజాలో విధులు నిర్వహించే సిబ్బందికి, జాతీయ రహదారి వెంట రాకపోకలు సాగించే డ్రైవర్లు, క్లీనర్ల ఆరోగ్య సంరక్షణకే అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్ కుమార్ అన్నారు. బుధవారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని అత్వంగ్ డిచ్ పల్లి టోల్వే ప్రైవేట్ లిమిటెడ్, ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో టోల్ ప్లాజాలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్వంగ్ డిచ్ పల్లి టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్ కుమార్, జిజిహెచ్ కంటి వైద్య నిపుణులు ఉమా మహేశ్వరి దేవి, ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ కంటిని కాపాడుకోవాలని, దుమ్ము ధూళి తో కండ్లు ఎర్రగా అవుతాయని, కండ్లకండ పెరుగుతుందని అన్నారు. కంటి చూపు లక్షణాలు ఉన్న వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా మేనేజర్ చలపతి రావు, సేఫ్టీ మేనేజర్ సతీష్ పానుగంటి, ఆపరేషన్ మేనేజర్ నీరజ్ దేశ్ పాండే, మెయింటెనెన్స్ మేనేజర్ వీరబాబు, అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ రెడ్డి, హైవే ఇంజనీర్ కృష్ణా కాంత్, కంటి వైద్యురాలు మానస,వ ఎండల విస్తరణ అధికారి వై శంకర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న 21 టిప్పర్లు సీజ్



నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని చిన్నాపూర్, సింగంపల్లి శివారులో అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న మొరం తవ్వకాలపై బుధవారం దాడులు నిర్వహించారు. జిల్లా టాస్క్ ఫోర్స్ ఏసిపి విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ అంజయ్య సిబ్బందితో కలిసి మెరుపు దాడులు నిర్వహించారు. అక్రమ మొరం తవ్వకాలు నిర్వహిస్తున్న రెండు జెసిబిలు, 21 టిప్పర్లను అధికారులు సీజ్ చేశారు. అక్రమ మైనింగ్ మొరం తవ్వకాలపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి వాహనాలను అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ వాహనాలు చిన్నాపూర్ గ్రామానికి చెందిన గంగారెడ్డి, బోర్గం గ్రామానికి చెందిన రాజేశ్వర్ గౌడ్‌కు చెందినవిగా సంచారం. ఈ దాడుల్లో టాస్కోర్స్ సిబ్బంది లక్ష్మన్న, సుదర్శన్, రాజేశ్వర్, రాములు, గజేందర్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో బోరు పనులు ప్రారంభం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని బోర్గం (కె) గ్రామంలోని శ్మశాన వాటికలో బోరు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రెండవ డివిజన్ కార్పొరేటర్ రాయ్ సింగ్ కొబ్బరికాయ కొట్టి బోరు పాయింట్ ను ప్రారంభించారు. త్వరగా గ్రామంలో శ్మశాన వాటికను పూర్తి చేయాలని ఎమ్మెల్యే పడి రాకేష్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. బీజేపీ నాయకులు రాంపురం గంగాధర్, భూమయ్య, ప్రశాంత్, మల్లయ్య, శ్రీరాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బోరు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

పీఎం సూరజ్ పోర్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- వర్చువల్ ద్వారా ప్రారంభించిన పీఎం మోడీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రధానమంత్రి సూరజ్ పోర్టల్ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఎస్సీ, ఓబీసీ, సఫాయి కర్మచారీ కుటుంబాల అభ్యున్నతి కాంక్షిస్తూ నూతనంగా నెలకొల్పిన ప్రధానమంత్రి సూరజ్ పోర్టల్‌ను బుధవారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ ద్వారా ప్రారంభించారు. సఫాయి కార్మికులకు బీమా పథకం అందుబాటులోకి తెచ్చారు. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇతర అధికారులు, లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ... అణగారిన వర్గాలైన ఎస్సీ, ఓబీసీ, సఫాయి కర్మచారీలకు ఆర్థిక పరమైన తోడ్పాటును అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూరజ్ పోర్టల్ ను ప్రవేశపెట్టిందని అన్నారు. అర్హులైన వారందరూ దీనిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లాలో ఈ పథకం ద్వారా యూనియన్ బ్యాంకు నుండి 173 మంది, తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుండి 135 మంది, స్త్రీ నిధి నుండి 475 మంది లబ్ధి పొందడం జరిగిందని లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకుల నుండి రుణాలు ఎలా పొందాలనే విషయాలపై యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ శివ కోటయ్య లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ రమేష్, స్త్రీ నిధి ప్రాంతీయ మేనేజర్ రామ్ దాస్, ఆయా బ్యాంకుల అధికారులు, లబ్ధిదారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

స్వగ్రామానికి చేరిన మృతదేహం

నవతెలంగాణ-భీమ్‌గల్

బడా భీంగల్ గ్రామానికి చెందిన లొక్కిడి రాఘవేంద్ర(20) బెహరన్ లో మృతి చెందగా బుధవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. మృతుడు బతుకుదెరువుకోసం వెళ్లి ఈనెల 6న గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ప్రవాస భారతీయుల హక్కులు సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహం నాయుడును కలిశారు. తమ కొడుకు మృతదేహాన్ని త్వరగా ఇంటికి చేర్చాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన కోటపాటి బెహరాన్ లో తెలుగు కళా సమితి సంక్షేమ కన్వీనర్ నోముల మురళి చొరవత మృతదేహాన్ని బడా భీంగల్ గ్రామానికి పంపించారు. బుధవారం ఎన్ ఆర్ ఐ సెల్ తెలంగాణ ప్రభుత్వ అధికారి చిట్టిబాబు శంషాబాద్ ఎయిర్ పోర్టు నుండి బడా భీంగల్ వరకు ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేయించారు. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు

నేడు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్

నేడు పట్టణంలోని బాలరాజ్ హాస్పిటల్‌లో హైదరాబాద్ అవిర సంతాన సాపల్యత కేంద్రం వారి ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వైద్యులు రాకేష్ కుమార్ బుధవారం తెలిపారు. కాగా 8309094990,7731999669 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ఆర్మూర్ ఆర్డీవో బదిలీ

నవతెలంగాణ-ఆర్మూర్

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు ముందస్తు చర్యల్లో భాగంగా రెవెన్యూ డివిజనల్ అధికారులను బదిలీ ప్రక్రియ బుధవారం నిర్వహించారు. 15 రోజుల క్రితం వచ్చిన రాజా గౌడ్ బదిలీ కాగా ఆయన స్థానంలో వరంగల్ నుండి స్రవంతి రానున్నట్లు తెలిసింది.

పదవి తరగతి పరీక్షలపై హెచ్‌ఎంలతో సమీక్ష



మాట్లాడుతున్న ప్రధాన ఉపాధ్యాయురాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న సందర్భంగా నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్వి దుర్గాప్రసాద్ నగరంలోని వినాయక నగర్ ప్రాంతంలోని వాసవి స్కూల్ లో నిజామాబాదు డివిజన్ స్థాయి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పదవ తరగతి పరీక్షల పైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఎటువంటి నియమ నిబంధనలు పాటించాలి, ఇన్విజిలేటర్లు పరీక్ష కేంద్రాల్లో ఏ విధంగా విధులు నిర్వహించాలి, పరీక్ష కేంద్రా లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి అనే అంశాలను వివరిస్తూ వారికి సూచన చేశారు. ఈ సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు ఏడు పరీక్షలుగా ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు బిగించడం జరుగుతుందని, 10వ తరగతి లక్ష్య ప్రోగ్రాంకు బదులుగా ఎస్ఎస్సి ప్రిపరేషన్ తీసుకువచ్చిందని అన్నారు. డ్రాప్ బాక్స్ విద్యార్థులు లేకుండా ప్రధానోపాధ్యాయులు చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏంఈఓ రామారావు పాల్గొన్నారు.

నేటి 'కిసాన్ మహా పంచాయత్' జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నేడు జరిగే "కిసాన్ మహాపంచాయత్" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని "సంయుక్త కిసాన్ మోర్చా" ఎస్కేఎం జిల్లా కమిటీ సభ్యులు పెద్దివెంట్రాములు , వేల్పూర్ భూమయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం రైతు వ్యతిరేక మూడు నెలల చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం ఢిల్లీలో పోరాడినప్పుడు 750 మంది ప్రాణ త్యాగాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం తలవంచి వారు తెచ్చిన నల్ల చట్టాలను రద్దు చేస్తూ., కనీస మద్దతు ధర చట్టం అమలు చేస్తామని, రైతు సంక్షేమం కోసం పనిచేస్తామని తెలిపారని పేర్కొన్నారు. ఏడు అంశాలపై రాతపూర్వక హామీనిచ్చి తుంగలో తొక్కి రైతాంగాన్ని మోసం చేసింది కేంద్ర ప్రభుత్వం అని తెలిపారు. ఆహామీల అమలుకు ఫిబ్రవరి 13న రైతులు మళ్ళీ పోరాటం ప్రారంభించారని తెలిపారు. ఎన్నికల ముందు జరుగుతున్న ఈ పోరాటం వల్ల నష్టం కలుగుతుందని, బిజెపి ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అన్నిదారులను మూసివేసి, వాటర్ క్యానన్లు ఉపయోగించి, రబ్బర్, బుల్లెట్లు, టియర్ గ్యాస్‌లను ప్రయోగిస్తూ బెదిరించిందని పేర్కొన్నారు. అయినా వెనక్కు తగ్గక పోవడంతో కాల్పులకు సైతం తెగబడిందని, అందులో ఒక రైతు అమరత్వం పొందారని తెలిపారు. ఈ పోరాటంలో మరొక నలుగురు వ్యవసాయ రంగం దివాలాస్థితిలో ఉన్నకారణాలతో గుండెపోటుతో మృతిచెందారని పేర్కొన్నారు. రైతులకు అండగా నిలవాలని సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తంగా నేడు మహా పంచాయతీ నిర్వహిస్తుందని తెలిపారు. ధర్నా చౌక్‌లో ఈకార్యక్రమం ఉంటుందని, రైతులు, వ్యవసాయ కూలీలు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ పరీక్షల్లో 750మంది గైర్హాజర్

- ఇద్దరిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్ పరీక్షల్లో మొదటి సంవత్సరం గణక శాస్త్రం, రసాయన శాస్త్రం పరీక్షల్లో జిల్లాలో బుధవారం ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాగా, 750 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరు అయ్యారని జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల తో పాటు మరో రెండు కళాశాలలు ఇంటర్ బోర్డ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేశారని తెలిపారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థి కాపీ చేస్తుండగా మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశామని, అలాగే నిజామాబాద్ పట్టణంలోని సత్య ఒకేషనల్ జూనియర్ కళాశాల్లో ఒక విద్యార్థిని కాపీ చేస్తుండగా పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి రఘురాజ్ తెలిపారు. జిల్లాలో ఈరోజు 96 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను ఇంటర్ బోర్డ్ స్క్వాడ్, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ ల ఆధ్వర్యంలో 50 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించామని తెలియజేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 36 మంది విద్యార్థుల పై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని జిల్లా ఇంటర్ విద్యా అధికారి రఘురాజ్ తెలిపారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ 4 కళాశాలలు, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, రజియుద్దీన్ అస్లాం, దేవరామ్ లు 7 పరీక్ష కేంద్రాలను, హై పవర్ కమిటీ డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో 6 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు. అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్లు 25 పరీక్ష కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ లు 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారని తెలిపారు. మొత్తం 18,825 మంది విద్యార్థులకు గాను 18,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని అన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జోనల్ చైర్మన్

నవతెలంగాణ-ఎడపల్లి

విద్యార్థులు ఏకాగ్రతతో చదివి పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ యార్లగడ్డ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డి, ఏవో కృష్ణ మోహన్, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఎడపల్లి మాజీ అధ్యక్షులు ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కదం ప్రకాష్‌రావు, ఉపాధ్యాయులు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా వస్తువుల వితరణ



నవతెలంగాణ-తాడ్వాయి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బ్రాహ్మణపల్లిలో బుధవారం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాయబోయే పరీక్షలకు అవసరమైన పరీక్షా సామగ్రి, అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు రబ్బర్లు, షార్ప్నర్లు, తదితర వస్తువులను ఆర్కే డిగ్రీ కళాశాలల డైరెక్టర్ ముసుకు జైపాల్ రెడ్డి దాతృత్వంతో అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కోశాధికారి తోరణాల సుధాకర్, రొటేరియన్ ముసుకు జైపాల్ రెడ్డి, దత్తాత్రి, వెంకటరమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో సిసి రోడ్ల నిర్మాణ పనులను మండల నాయకులు పెద్ది హనుమాన్లు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బింగి శేఖర్, బుడిమె శ్రీనివాస్, నాగంపల్లి కృష్ణ, కిష్టారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణం-బిచ్కుంద/మద్నూర్

మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘంలో సంఘం సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు గడ్డం అరవింద్ మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్ల మున్నూరు కాపుల ఐక్యత పోరాటం ఫలించిందని కార్పొరేషన్ ఏర్పాటుతో మున్నూరు కాపులు అన్ని రంగాల్లో ముఖ్యంగా వ్యవసాయ, విద్యా, ఉపాధి, ఉద్యోగ రంగాలలో అభివృద్ధి చెందుతారన్నారు. గతంలో మున్నూరు కాపు కార్పొరేషన్ కోసం ఉద్యమాలు ధర్నాలలో మున్నూరు కాపులు పాల్గొన్నారని అప్పటి ప్రభుత్వం అరెస్టు చేసిన వెనకడుగు వేయలేదని తెలిపారు. ఎన్నో ఏళ్ల మున్నూరు కాపుల కార్పొరేషన్ కల నేటితో సహకారం అయిందని అన్నారు. మండల అధ్యక్షులు గడ్డం అరవింద్, కార్యదర్శి రమణ, టౌన్ అధ్యక్షులు బొమ్మ ల లక్ష్మణ్, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు సోపాన్ సార్, ఎంపిటిసి సురేష్, అస్పత్ వార్ అశోక్, హాజీబా లాజ్, మున్నూరు కాపులు, సంఘం సభ్యులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు గంగాధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ.. మున్నూరు కాపు కార్పొరేషన్ కోసం గత ప్రభుత్వాలకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు లోపే మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



బిచ్కుందలో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మున్నూరు కాపు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు పట్ల పాలభిషేకం

మద్నూర్ : మున్నూరు కాపుల ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదించడం పట్ల మద్నూర్ మండల కేంద్రంలో బుధవారం ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ ముఖ్యమంత్రి చిత్రపటానికి మున్నూరు కాపులు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు ఎస్.గంగరామ్, మద్నూర్ గ్రామ అధ్యక్షులు డాక్టర్ బండివార్ విజయ్, ప్రధాన కార్యదర్శి సందూర్‌వార్ హనుమాన్లు, ఉపాధ్యక్షులు కర్లవారు సాయిలు, మున్నూరు కాపు పెద్దలు హనుమాన్లు, స్వామి, గడ్డం లక్ష్మణ్, కొండ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు చేయూత

- పెళ్లి కోసం ఆర్థిక సాయం



నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన అయ్యవారి బిక్షపతి కుటుంబానికి బుధవారం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు నీరుడి సాయన్న వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. గత కొన్ని సంవత్సరాల క్రితం తల్లిదండ్రులు చనిపోయినప్పటి నుంచి ఒంటరిగా బతుకుతున్నాడు. అతనికి బట్టలు, నిత్యావసర వస్తువుల ఖర్చుల నిమిత్తం గత 19 సంవత్సరాల నుంచి నీరుడి సాయన్న స్కూల్ అసిస్టెంట్ శెట్టిపల్లి ఉన్నత పాఠశాలకి చెందిన ఉపాధ్యాయుడు ఆర్థిక సహకారాన్ని అందిస్తూ వస్తున్నారు. అందులో భాగంగానే అతని పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.11,111 ఇచ్చి ఆయన వివాహం జరిపించుటకు సహాయం అందించారు. బిక్షపతి పెళ్లి నిమిత్తం ఆర్థిక సాయం అందించడంతో గ్రామస్తులు ఉపాధ్యాయునికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పర్వయ్య, మాజీ ఎంపీటీసీ నర్సింలు గ్రామస్తులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

నవతెలంగాణ-దోమకొండ

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అన్నారు. మండలంలోని లింగుపల్లి, ముత్యంపేట ప్రభుత్వ పాఠశాలలను అకాడమిక్ మానిటరింగ్ సెక్టోరియల్ అధికారి వేణు శర్మతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పర్మల్ల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. అలాగే పదోతంగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎస్ఎంసి చైర్మన్ కొర్ర శంకర్ తనయుడు కుర్ర నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సందీప్ కుమార్, నాగరాజురావు, వినయ్ కుమార్, సునీత, సంగమేశ్వర్, బాల నర్సయ్య సురేష్, అర్చన పాల్గొన్నారు.

బాధితుడికి సెల్ ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-బాల్కొండ

ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయంలో బుధవారం అప్పగించారు. గత నెల 10న ఉత్తర ప్రదేశ్ కు చెందిన సర్మన్ అనే వ్యక్తి లారీని తీసుకొని హైదరాబాద్ వెళ్ళేటప్పుడు మార్గమధ్యలో బాల్కొండలోనీ రాజస్థాన్ దాబా దగ్గర ఆయన రెడ్మి ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయమై బాధితుడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్లు గుర్తించి బాధితుడు సర్మాన్‌కు హెడ్ కానిస్టేబుల్ జయవంత రావు ఫోన్ అందజేశారు.

దేశ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- రైతుభీమా, రైతు బంధుతో మోసం చేసింది కేసీఆర్
- నల్ల చట్టాలు తెచ్చి రైతుల ప్రాణాలు బలిగొన్న మోడీ
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- 100 పడకల ఆసుపత్రికి భూమిపూజ

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రంలో 33 కోట్లతో నిర్మించతలపెట్టిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు మంగళవారం రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి భూమి పూజ చేశారు. అనేక సంవత్సరాలనుండి ఈప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్న 100 పడకల ఆసుపత్రి కల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో నెరవేరనుందని అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎన్నికల వేల ఆర్భాటాలకు వెళ్లి కాలేజీకి సంబంధించిన భూమిలో హడావుడి చేసి శంకుస్థాపనలు చేశారని తెలిపారు. స్థలం ఇంతపెద్ద ఆస్పత్రి నిర్మాణం ఆకొద్ది స్థలంలో నిర్మించడం కష్టంగా ఉంటుందని అధికారుల నిర్ణయంతో ప్రస్తుతం 30 పడకల ఆసుపత్రి శిథిలావస్థకు చేరడంద్వారా ఆసుపత్రి స్థలంలోనే విశాలమైన 5 ఎకరాల స్థలంలో సువిశాలమైన భవనాలు నిర్మాణం చేపట్టడం జరుగుతుం దని అన్నారు. రానున్న 18 నెలల్లో నూతన ఆసుపత్రి భవనం ప్రజా ఆరోగ్య సేవలు అందిం చేందుకు సిద్ధం కానుం దని అన్నారు. అప్పటి వరకు తాత్కాలికంగా మండల కేంద్రములో తహసీల్దార్ కార్యాలయం ముందు ఉన్న బిసి బాలుర వసతి గృహంలో వైద్య సేవలు కొనసాగించేందుకు , ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తు చ తప్పకుండ పాటిస్తుందని అన్నారు. ఇచ్చిన ఆరు గ్యారం టీలు అమలు చేస్తామని అన్నారు. ఇప్పటికే మహిళలకు బస్సు ఉచిత ప్రయాణం, గృహజ్యోతి అమలు చేశామని అన్నారు.

కేసీఆర్ రైతులకు రైతు భీమా, రైతు బంధు అంటు నిజమైన రైతులకు మోసం చేయడమే కాకుండా వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా, పంట బీమా, ఫర్టిలైజర్, పనిముట్లపై ఎలాంటి రాయితీలు లేకుండా చేసి వారిని నిండా ముంచాడని అన్నారు. దేశ రైతులకు గిట్టుబాటు ధరపై చట్టం తెద్దామంటే బీజేపీ ముందుకు రావడంలేదని విమర్శించారు. దేశ రైతులకు ముంచేందుకు నల్ల చట్టాలు తెచ్చి వందల మంది రైతుల ప్రాణాలు బలిగొనడం మోడీకే చెల్లు తుందని దుయ్యబట్టారు. బిసి కులగణనపై బీజేపీ ముందుకు రావడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న బిసి కులగణనతో బిసిలు అభివృద్ధి చెందుతారని అన్నారు. వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి, నాయకులు ముప్పు గంగారెడ్డి, శేఖర్ గౌడ్, మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, తహసీల్దార్ మాలతీ, ఎండిఓ బాల కృష్ణ, మండల నాయకులు జెసిబి శ్రీనివాస్, మిట్టపల్లి గంగారెడ్డి,మనోహర్ రెడ్డి,పుప్పాల సుభాష్, భగవాన్ రెడ్డి, సుభాష్, జాన్ రెడ్డి, జనార్ధన్, కమ్మరి గంగాధర్, ఏలేటి సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే